www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 బుధవారం

# వెలుతురు

రంగారెడ్డి। 27, మార్చి 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 307, పేజీలు: 12, వెల: రూ.5/-


## కడిగిన ముత్యంలా బయటికి వస్తా

- ఇది మనీలాండరింగ్ కేసు కాదు..
- పొలిటికల్ లాండరింగ్ కేసు
- తాత్కాలికంగా జైల్లో పెడతారు
- మా ఆత్మ స్థైర్యాన్ని దెబ్బ తీయలేరు
- తప్పుడు కేసు, ఇది రాజకీయ కుట్ర
- మీడియాతో కవిత కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,మార్చి26(వెలుతురు): కోర్టుకు హాజరుపరిచిన సమయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇది మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు అని అని అన్నారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని చెప్పారు.

మిగతా.. 2లో



# జేబు దొంగ రేవంత్ రెడ్డి

- వెంట్రుక కూడా పీకలేడు
- ఎన్నికల తర్వాత బిజెపిలో చేరే మొదటి వ్యక్తి రేవంత్ రెడ్డినే
- అందుకే రాహుల్ గాందీకి భిన్నంగా బడేభాయ్ మోడీ అంటున్నడు రేవంత్ రెడ్డి
- రేవంత్ అందుకే జీవితమంతా కాంగ్రెస్‌లోనే ఉంటా అని ఏనాడు అనడం లేదు
- 2500 కోట్లను ఢిల్లీకి రేవంత్ రెడ్డి పంపిండు
- జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న జేబు దొంగ రేవంత్ రెడ్డి
- రేవంత్ రెడ్డిపై విరుచుపడిన కేటీఆర్
- బిజెపి మా పార్టీపై పగ పట్టింది
- సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరైన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు


హైదరాబాద్, (వెలుతురు): ఈ రోజు కాంగ్రెస్‌కు బిజెని అపే దమ్ము లేదు, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి విచిత్రంగా ఉంది, ఇక్కడున్నది బిజెపి ఉన్నట్లు ఉంది. అక్కడ రాహుల్ గాందీ చౌకిదార్ చోర్ అంటే, రేవంత్ మాత్రం బడే భాయ్ బాగుండు అంటారు. అక్కడ అదానీ మంచోడు కాదు అంటే, రేవంత్ రెడ్డి మాత్రం మంచోడు అంటాడు అక్కడ రాహుల్ గాందీ, గుజరాత్ మాడల్ దుర్మార్గం అంటే, ఇక్కడ మా బడేభాయ్ మాడల్ బాగుందని రేవంత్ అంటుండు. ఇక్కడ రేవంత్ రెడ్డి బీజేపీ పాట పాడుతుండు .
పార్లమెంట్ ఎన్నికల తర్వతా బిజెపిలో చేరే మెదటి వ్యక్తి రేవంత్ రెడ్డినే. కాంగ్రెస్ పార్టీకి ఈఎన్నికల్లో 40 సీట్లు దాటదు. ఎన్నిసార్లు ఆయన ఎన్నికల తర్వాత బిజెపిలోకి వెళ్తారని విమర్శలు చేస్తే.. అనవసరమైన పైన వాటి పైన అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వాటి పైన స్పందించలేదు. నా జీవిత మంతా కాంగ్రెస్‌లో ఉంటా అని ఏనాడు చెప్పలేదు. ఎందు కంటే ఎన్నికల తర్వాత తన మనుషులతో బిజెపిలో చేరుతారు.
ఒకవైపు ఇసుక దందా, రైస్ మిల్లర్ల పైన బ్లాక్ మెయిల్ చేస్తున్నారు,

మిగతా.. 2లో

## ట్యాపింగ్ మంటలు..

# అగ్రనేతల కన్నెర్ర..!

- కేసీఆర్‌దే బాధ్యత..
- రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం
- దీనిపై న్యాయవిచారణ జరిపించాల్సిందేనని డిమాండ్
- మొదటి ముద్దాయి కేసీఆరే.. కేసు సీబీఐకి అప్పగించాలి
- దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో నా ఫోన్లు విన్నారు
- హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డినీ ముద్దాయిలుగా చేర్చాలి
- మునుగోడులో కోమటిరెడ్డి ఓటమికీ ట్యాపింగే కారణం
- హైకోర్టు దీన్ని సుమోటోగా స్వీకరించి విచారించాలి
- ఈ నెల 19న.. విమానంలో హరీశ్, రేవంత్ చర్చలు
- అందుకే చర్యలపై సర్కారు వెనకడుగు: రఘునందన్
- నా ఫోనూ ట్యాప్ చేశారు..
- కఠిన చర్యలు తీసుకోండి
- డీజీపీకి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం ఫిర్యాదు'





హైదరాబాద్, (వెలుతురు): రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రస్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో రోజుకొక కొత్త పేరు వెలుగులోకి వస్తుండడంతో బీజేపీ నేతలు గత ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఈ వ్యవహారానికి నాటి ముఖ్యమంత్రిదే బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. కొందరు మంత్రులు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులతో అప్పటి సీఎం ఈ వ్యవహారాన్ని దుర్మార్గంగా నడిపించారంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల మాఫియాలూ రాజ్యమేలాయని దుయ్యబట్టారు. ట్యాపింగ్ వ్యవహారంతో అవినీతి అంశం కూడా ముడిపడి ఉందని.. దీనిపై న్యాయవిచారణ జరిపితేనే నాటి సీఎం, డీజీపీ, ఉన్నతాధికారుల జోక్యం ఎంతనే విషయం బయటపడుతుందని వ్యాఖ్యానించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ హయాంలో తమ పార్టీ నాయకుల ఫోన్లను, ఆఫీస్ సిబ్బంది ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయని మండిపడ్డారు. వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేయడం కోసం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇక.. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చేర్చాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా తన ఫోన్‌ను కూడా ట్యాప్‌చేసి తన ప్రచార తీరుతెన్నులను తెలుసుకొని ఇబ్బందులకు గురిచేశారని ఆయన ధ్వజమెత్తారు. దానికి సంబంధించి రెండో

మిగతా.. 2లో



# రెఫరెండమే!

- వంద రోజుల పాలనపై తీర్పుగానే భావిస్తాం
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే ఇందుకు గీటురాయి
- 6 లేదా 7న తుక్కుగూడలో శంఖారావం
- 5 గ్యారెంటీలకు రాహుల్ హామీ: సీఎం రేవంత్

హైదరాబాద్, (వెలుతురు): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో 14 సీట్లు గెలుచుకుని సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెబుదామని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని రంగారెడ్డి జిల్లా నుంచే పూరిస్తామని, ఏప్రిల్ 6 లేదా 7న తుక్కుగూడలో జనజాతర పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో ఆరు గ్యారెంటీలను ప్రకటించిన సంగతి రేవంత్ గుర్తు చేశారు. మళ్లీ అక్కడే

మిగతా.. 2లో

# ఫోన్‌ట్యాపింగ్‌లో కెసిఆర్ ప్రధాన దోషి

- కడిగిన ముత్యంలా వస్తానన్న కవిత
- ఏ విషయంలో కడిగిన ముత్యమో చెప్పాలి
- లిక్కర్ స్కామ్‌తో తెలంగాణ పరువు తీసిన కవిత
- ఫోన్‌ట్యాపింగ్‌లో కెసిఆర్ ప్రధాన దోషి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ/హైదరాబాద్,మార్చి26(వెలుతురు): తీహర్ జైలుకు వెళుతూ వెళుతూ..ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి, బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఏ విషయంలో కడిగిన ముత్యంలా వస్తావని ప్రశ్నించారు. తెలంగాణ పరువు పోయిందని, ఢిల్లీ వీధుల్లో తెలంగాణను బాజరుకీడ్చిన కవిత కడిగిన ముత్యంలా వస్తానని అనడం సిగ్గుచేటన్నారు. అయితే తనపై పెట్టింది మనీలాండరింగ్ కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తనను తాత్కాలికంగా జైలుకు పంపొచ్చు కానీ, ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఈ కేసులో ఒక నిందితుడు ఇప్పటికే బిజెపిలో చేరారని, ఇంకొక్కరికి లోకసభ ఎన్నికలలో బిజెపి టికెట్ ఇచ్చిందని ఆమె తెలిపారు. ఇది మంగళవారం తనను కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకువచ్చిన సందర్భంగా కవిత మాట్లాడారు. అలాగే, మూడో నిందితుడు కేసు నుంచి బయటపడేందుకు రూ 50 కోట్లు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపికి అందజేశారని ఆరోపణలు చేశారు. తనపై

మిగతా.. 2లో




## కడిగిన ముత్యంలా
# బయటికి వస్తా...

మొదటిపేజీ తరువాయి..

తాత్కాలికంగా జైల్లో పెడతారు..మా ఆత్మ స్థైర్యాన్ని దెబ్బ తీయలేరు అని అన్నారు. తప్పుడు కేసు, ఇది రాజకీయ కుట్ర అని చెప్పారు. మనీ లాండరింగ్ కేసు కాదిది, పొలిటికల్ లాండరింగ్ కేసు లా ఉందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి బీజేపీ లో చేరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో వ్యక్తి బీజేపీ కూటమి లో పోటీ చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మూడో వ్యక్తి బీజేపీకి 50 కోట్ల విరాళాలు ఇచ్చారని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. కాగా ఢిల్లీ మద్యం కేసులో అరెస్టైన ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీ ముగిసింది. ఈ నేపథ్యంలో ఆమెను రౌజ్ అవెన్యూ కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు హాజరుపరిచారు. ఈడీ తరపు న్యాయవాది జోయబ్ హుస్సేన్ ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించారు. 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపాలని కోరారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని.. పలువురు నిందితులను ఇంకా ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.

## అమ్మాయిల్లో పెరుగుతున్న
# మాదక ద్రవ్యాల వ్యసనం

### ప్రాణాలు కోల్పోతున్న అమ్మాయిలు
### అమ్మాయిల్లో రోజురోజుకూ పెరుగుతోన్న వ్యసనాల ధోరణి

హైదరాబాద్,మార్చి26(వెలుతురు): డ్రగ్స్ వ్యసనం ఆరోగ్యానికి చాలా హానికరం. అయితే నేటి కాలంలో మద్యం, గంజాయి, చరస్‌లు, సిగరెట్‌ల మాయలో పడి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సమాజంలో పురుషులలో ఈ వ్యసనం ప్రాబల్యం చాలా ఎక్కువగా ఉంది. అయితే అమ్మాయిల్లో కూడా ఈ వ్యసనాల ధోరణి రోజురోజుకూ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ ట్రెండ్ ప్రధానంగా నగరాలు, శివారు ప్రాంతాల్లో పెరుగుతోంది. గ్రామాలపై ఈ ధోరణి తక్కువ. ఆడపిల్లల్లో డ్రగ్స్ వ్యసన ధోరణి ఎందుకు పెరుగుతోంది అనే ప్రశ్న సహజంగానే అందరి




మదిలో మెదులుతుంది. ఈ వ్యసనాలకు కుటుంబంతో సంబంధం ఉందని నిపుణులు అంటున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు క్రమం తప్పకుండా డ్రగ్స్ తీసుకునే వారు ఉన్నట్లయితే వారి కుమారులు, కుమార్తెలలో ఈ విధమైన ధోరణి కనిపిస్తుంది. స్త్రీ మానసిక స్థితి వ్యసనానికి గల మరొక కారణం. అవును.. తక్కువ ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తులు, ఏ పరిస్థితిలోనైనా ఆందోళనకు గురవుతారు. సాధారణంగా ఇటువంటి వారిలో మాననసిక దృఢత్వం తక్కువగా ఉంటుంది. మానసిక బలం లేకపోవడంతో వ్యసనాల వలలో చిక్కుకుంటారు.చాలా మంది మహిళలు డిప్రెషన్ కారణంగా వ్యసనం ఉచ్చులో పడతారు. బ్రేకప్‌తో నిరాశ చెందడం లేదా కెరీర్‌లో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోవడం వంటి కారణాల వల్ల ప్రస్తుత కాలంలో చాలా మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. చాలా మంది దాని నుండి బయటపడటానికి ఈ విధమైన తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటున్నారుడ్రగ్స్ వ్యసనానికి వ్యక్తిత్వ లోపాలు కూడా ఒక కారణం కావచ్చు. చాలా మందికి తమ స్నేహితులు, పొరుగువారు డ్రగ్స్ తీసుకోవడం చూసినప్పుడు వారిలో కూడా ఆ కోరిక కలుగుతుంది. ఈ విధంగా చాలా మంది వ్యసనాల వలయంలో చిక్కుకుంటున్నారు.అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి.. ఆల్కహాల్ తాగడం వల్ల, డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఏ సమస్య పరిష్కారం కాదు. పైగా ఈ అలవాట్లు శరీరానికి వివిధ నష్టాలను కలిగిస్తుంది. ధూమపానం వల్ల ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఇక అమ్మాయిల్లో సక్రమంగా రుతుక్రమం రాదు. గర్భధారణ సమస్యలు తలెత్తుతాయి. ఆరోగ్యవంతమైన జీవితానికి మాదకద్రవ్యాల రహిత జీవితం ఎంతో సుఖమయం చేస్తుంది.

# తుది దశకు కాంగ్రెస్ అభ్యర్థుల లిస్ట్..

### సామాజిక సమీకరణాలు, సర్వేల ఆధారంగా ఎంపిక
### ఆశావహుల మధ్య నెలకొన్న పోటాపోటీ

హైదరాబాద్,మార్చి26(వెలుతురు): తెలంగాణలో ఎంపీ అభ్యర్థుల్ని ప్రకటించి ఎన్నికల సంగ్రామానికి బీజేపీ, బీఆర్ఎస్ సిద్ధమయ్యాయి. కాంగ్రెస్ మాత్రం రెండు విడతల్లో 9మంది అభ్యర్థులను మాత్రమే ప్రకటించింది. మరో 8 స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. ఆ 8 స్థానాల కోసం 16మంది ఆశావాహులు పోటీపడుతున్నారు. మరి అధిష్ఠానం ఎవరిని ఫైనల్ చేస్తుంది? వాళ్ల పేర్లను ఎప్పుడు అనౌన్స్ చేయబోతోంది? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. అబ్ కీ బార్.. చార్ సౌ పార్.. అంటూ దేశవ్యాప్తంగా నినదిస్తోన్న భారతీయ జనతా పార్టీ.. తెలంగాణలో డబుల్ డిజిట్ టార్గెట్‌తో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైంది. 17 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. అటు బీఆర్ఎస్ సుదీర్ఘ కసరత్తు, చర్చలు, వడపోతల అనంతరం విడతల వారీగా అభ్యర్థులందరి పేర్లను వెల్లడించింది. అయితే కాంగ్రెస్ మాత్రం అభ్యర్థుల ప్రకటనలో వెనకబడి పోయింది. ఇప్పటిదాకా రెండు లిస్ట్‌లు ప్రకటించింది. అందులో 9మంది పేర్లను మాత్రమే ఫైనల్ చేసింది. మిగతా 8 స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. ఆ సెగ్మెంట్‌లలో ఆశావహుల మధ్య పోటాపోటీ నెలకొంది. ఆత్రం సుగుణ.. డాక్టర్ సుమలత.. వీళ్లిద్దరూ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. సీటు కేటాయిస్తే కచ్చితంగా గెలిచి చూపిస్తామని కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. నిజామాబాద్‌లో జీవన్ రెడ్డి, సునీల్ రెడ్డి మధ్య పోటాపోటీ నెలకొంది. ఎవరి స్టైయిల్‌లో వాళ్లు అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునే



పనిలో పడ్డారు. కరీంనగర్ స్థానం తమకే కేటాయించాలని ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్ పట్టుబడుతున్నారు. ఇద్దరిలో ప్రవీణ్ రెడ్డికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ మరోసారి రేసులో నిలిచారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరిన దయాకర్.. ఛాన్స్ ఇస్తే గెలుపుని కానుకగా ఇస్తానని ధీమాగా చెబుతున్నారు. అటు దొమ్మటి సాంబయ్య తనకే సిటివ్వాలని పట్టుబడుతున్నారు. ఖమ్మం బరిలో మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. హాట్ సీట్ కోసం కూల్‌గా ప్రయత్నాలు చేస్తున్నారట ప్రసాద్ రెడ్డి. అయితే ఇదే స్థానంలో పోటీ చేయాలని భావిస్తున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని. ఇక భువనగిరి స్థానంపై చాలా ఆశలు పెట్టుకున్నారు చామల కిరణ్ కుమార్. మొన్నటిదాకా కోమటిరెడ్డి లక్ష్మి బరిలో ఉంటారని ప్రచారం జరిగినా.. అందులో ఏమాత్రం నిజం లేదని క్లారిటీ ఇచ్చారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఈ క్రమంలోనే నేనున్నానంటూ సీన్‌లోకొచ్చారు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి. మల్కాజిగిరి సీటు ఆశలు గల్లంతు కావడంతో భువనగిరికి షిఫ్ట్ కావాలని డిసైడ్ అయ్యారట. దీంతో చామల, కంచర్ల మధ్య పోటీ నెలకొంది. మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు – నీలం మధు ఎవరి స్టైయిల్‌లో వాళ్లు సీటు కోసం పైరవీలు చేస్తున్నారట. అటు హైదరాబాద్ సెగ్మెంట్‌లో షబానా తబుస్సుం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారట. అలాగే అలీ మస్కటి కూడా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానం మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోందంటున్నారు కాంగ్రెస్ పార్టీ నేతలు. వ్యక్తిగత పరపతి, ఆర్థిక పరిస్థితి, సామాజిక సమీకరణాలు, సర్వేల ఆధారంగా ఎంపిక ఉంటుందంటున్నారు. కాస్త లేట్ అయినా బీజేపీ, బీఆర్ఎస్‌లకు ధీటైన నేతలు బరిలో నిలుస్తారని నమ్మకంగా చెబుతున్నారు. ఫైనల్‌గా పార్లమెంట్ బరిలో ట్రయాంగిల్ ఫైట్ రసవత్తరంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# జేబు దొంగ రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

బిల్డర్లను బెదిరించడం, రియల్టర్లను బెదిరించడం లాంటి వార్తలన్ని బయటకు రాకుండా స్కామ్ ల పేరు చెప్పి, ఈ వార్తలనే టీవీలలో తిప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, మూడు నెలలుగా ఎందుకు బిల్డింగ్ లకు అనుమతులు ఇవ్వడం లేదు?డబ్బులు ఇస్తేనే అనుమతులు ఇస్తామని, ఢిల్లీకి 2500 కోట్ల రూపాయలు పంపింది నిజం కాదా?

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి లెక్క మాట్లాడటం లేదు, రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని జేబుదొంగ లెక్క తిరుగుతున్నాడు. ఈసుంటోడు మన ముఖ్యమంత్రిగా ఉన్నాడు. కరెంటు ఇయ్యడానికి, రైతుబంధు ఇయ్యడానికి, మహిళా మణులకు 2500 ఇయ్యడానికి, 4000 పెన్షన్లు ఇయ్యడానికి చేతకాదు. కానీ ఇవన్నీ కవర్ చేయడం కోసం ఫోన్ ట్యాపింగ్, స్కాముల అంటూ వార్తలు రాపిచ్చుకుంటున్నాడు.

నీ చేతులలో అధికారం ఉంది కదా ఏం చేస్తావో చెయ్ ఎవరెవరు, తప్పులు చేసినా వాళ్ళ పైన చర్యలు తీసుకో . రేవంత్ రెడ్డికి భయపడే వారు లేరు, వెంట్రుక కూడా పీకలేదు. ఆయనకు ముఖ్యమంత్రిగా అసలు పని చేసే తెలివి లేదు.

రాజకీయాల్లో సికింద్రాబాద్ అంటేనే గుర్తుకొచ్చే పేరు పద్మారావు పేరు. 24 ఏండ్ల నుంచి పార్టీకి నగరంలో అండగా ఉన్నారు. పద్మారావు పోటీ చేస్తున్నారనగానే పార్టీ గెలుస్తుందని అందరు చేప్తున్నారు. కష్టకాలంలో అండగా ఉన్నవాళ్లే నాయ కులు. దానం నాగేందర్ పార్టీ వదిలిపోయారు, రాజకీయాల్లో హత్యలుండవు, అత్మహత్యలు ఉంటాయి. ఆయన నిర్ణయం తప్పు అని ఎన్నికల్లో గెలిచి మనం చూపించాలి. ఆయన అధికారం కోసం ఆశపడి, గెలిపించిన ప్రజలకు ద్రోహం చేసి వెళ్ళాడు, ఖైరతాబాద్ ప్రజలే మన పార్టీని గెలిపించి, ఆయన నిర్ణయం తప్పని నిరూపిస్తారనే నమ్మకం నాకున్నది.

నాగేందర్ అవకాశవాద రాజకీయాల కోసం వెళ్ళిండు అని అందరూ అంటున్నారు. గతంలో ఆసిఫ్ నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన పరిస్థితి మళ్ళీ రిపీట్ అవుతుంది. రెండు పడవల ప్రయాణం ఎప్పుడు కూడా మంచిది కాదని దానం విషయంలో అర్థం అవుతుంది. స్పీకర్ దానం నాగేందర్ పైన ఇచ్చిన ఫిర్యాదు పైన వెంటనే నిర్ణయం తీసుకోవాలి. అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. అవసరం అయితే సుప్రీంకోర్టు దాకా వెళ్లి మరి అనర్హుడిగా ప్రకటించేలా చేస్తాం. మూడు నాలుగు నెలల్లోనే ఖైరతాబాద్ లో ఉప ఎన్నిక వస్తుంది. దానికి సిద్ధంగా ఉండాలి. ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలి.సికింద్రాబాద్ లో మన పోటీ కాంగ్రెస్తో లేనేలేదు, దానం నాగేందర్ ను ప్రజలు సీరియస్ గా తీసుకోవడం లేదు

గతంలో అంబర్‌పేటలో ఓడిపోతే అదృష్టవశాత్తు సికింద్రా బాద్ ఎంపీ అయిండు కిషన్ రెడ్డి. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి చేసిన అతిపెద్ద మూడు పనులు కురుకురే ప్యాకెట్లు పంచడం, సీతాఫల్మండిలో రైల్వే లిఫ్ట్ ఓపెన్ చేయడం, సింటెక్స్ ట్యాంకులను ఓపెన్ చేయడం. ఇవే కిషన్ రెడ్డి హైదరాబాద్ కు చేసిన గొప్ప సేవ.

ఆయన సొంత నియోజకవర్గం అంబర్ పేటలో ఫ్లైఓవర్ కేంద్ర ప్రభుత్వం నిధులతో కట్టించండి అంటే ఇంకా నాన్చు తూనే ఉన్నారు.మనం మాత్రం 36 ఫ్లై ఒవర్ లు పూర్తి చేసినం. కిషన్ రెడ్డికి ఓటేసేందుకు ఒక్క కారణం లేదు. హైదరాబాద్ నగరం బిఆర్ఎస్ కు కోటగా మారింది. బిజెపి, బిఆర్ఎస్ అనే మాటను నగర ప్రజలు నమ్మలేదు, అందుకే క్లీన్ స్వీప్ చేసినం.

బిజెపి రాముడి అడ్డుపెట్టుకుని చేస్తున్న నాటకాన్ని ప్రజలు గమనించాలి. కిషన్ రెడ్డికి దమ్ముంటే లిక్కర్ స్కాంలో ఏముందో కోర్టుకు చెప్పాలి, కిషన్ రెడ్డి ఏం చేసిండో చెప్పి ఓటు అడగాలి. ఈరోజు సికంద్రబాద్ లో పోటీ ఒక విఫల ఎంపి కిషన్ రెడ్డికి, అవకాశవాద యంఎల్యే దానంకు, ఇంకోవైపు నిబద్ధత కలిగిన పద్మారావుల మధ్య ఉన్నది.

అరోజు కవితమ్మను అరెస్టు చేయలేదు అని ప్రచారం చేసిన కాంగ్రెస్ ఈ రోజు ఏం అంటుంది? సుప్రీం కోర్టులో కేసుంది కాబట్టే అరెస్ట్ చేయలేదు, కానీ ఈరోజు బిజెపి మా పార్టీపై పగ పట్టింది.

# ఫోన్‌ట్యాపింగ్‌లో కెసిఆర్ ప్రధాన దోషి

మొదటిపేజీ తరువాయి..

చట్టవిరుద్ధంగా తప్పుడు కేసు బనాయించారని, న్యాయపోరాటం చేసి కడిగిన ముత్యం మాదిరిగా బయటకు వస్తానని కవిత స్పష్టం చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టైన కవితను తీహార్ జైలుకు తరలించారు. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నుంచి నేరుగా ఆమెను జైలుకు తరలించారు ఈడీ అధికారులు.

కవితకు ఇంటిభోజనంతో పాటు.. మెడిసిన్స్, పెన్ను, పుస్తకాలు, పేపర్స్, బెడ్ షీట్, బ్లాంకెట్ వాడుకునేందుకు కోర్టు అనుమతిచ్చింది. ఏప్రిల్ 9వ తేదీ వరకు కవితను విచారించ నున్నారు. 9న ఉదయం 11గంటలకు కవితను కోర్టులో ప్రొడ్యూస్ చేయనున్నారు. పదిరోజుల కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టులో కవితను హాజరుపర్చారు ఈడీ అధికారులు. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ఇవ్వాలని ఈడీ అధికారులు కోరారు. అందుకు కోర్టు అనుమతించడంతో కవితను తీహార్ జైలుకు తరలించారు. కవిత కేసులో ఇరుక్కోవడం ద్వారా తెలంగాణ పరవుఉ పోయిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. లిక్కర్ స్కాంలో కవిత అరెస్టుకు.. తెలంగాణ సెంటిమెంట్ కు సంబంధం లేదన్నారు. ఢిల్లీలో కేజీవ్రాల్‌తో కవిత చర్చలు జరపలేదా సూటిగా చెప్పాలని ప్రశ్నించారు.

కవిత రాష్ట్ర పరువు తీశారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవిత అరెస్టుకు.. బీజేపీ సంబంధం లేదని చెప్పారు. కవిత అరెస్ట్ అక్రమం అనడం సరికాదన్నారు. లిక్కర్ కేసుతో కవితకు సంబంధం లేదని బీఆర్ఎస్ అంటోందని.. దీనిపై కేసీఆర్ బహిరంగ చర్చకు సిద్ధమా అని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అబద్దాలతోనే రాజకీయం చేసిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు అన్ని రకాల మాఫియా చేశారని.. రాష్ట్రంలో మాఫియా పాలన కొనసాగిందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. మా నేతల ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కఠినంగా వ్యవహరించా లని.. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఫోన్ ట్యాపింగ్ కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలని కిషన్ రెడ్డి అన్నారు.

# రెఫరెండమే!

మొదటిపేజీ తరువాయి..

జాతీయ స్థాయిలో ఐదు గ్యారెంటీలను ప్రకటించుకోబోతున్నట్లు చెప్పారు. మంగళవారం సీఎం రేవంత్ నివాసంలో జరిగిన చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లలో 14 సీట్లు గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉన్నామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందని తెలిపారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందని చెప్పారు. అన్ని రకాలుగా ఆలోచించిన తర్వాతేచేవెళ్లలో రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరిలో సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌ని పార్టీ అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించిందని అన్నారు.

### పదేళ్లలో ప్రధాని మోదీ ఏం చేశారు?

గడిచిన పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ.. రాష్ట్రానికి, దేశానికి ఏం చేశారని రేవంత్ ప్రశ్నించారు. "ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదు. బుల్లెట్ ట్రైన్‌ను గుజరాత్‌కు తీసుకెళ్లిన మోదీ.. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురాలేదు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకున్న ఆయన.. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. రీజనల్ రింగు రోడ్డు రాకుండా.. బీజేపీ మోకాలు అడ్డుతోంది. ఇంక ఏం చూసి మూడోసారి మోదీకి ఓటు వేయాలి?" అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి ఓటేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు అభ్యర్థులను కాకుండా మోదీని చూపించి ఓటడుగుతున్నారని ఎద్దేవా చేశారు. పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలి అన్నట్లుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం వ్యవహార శైలి ఉందని వ్యాఖ్యానించారు.

### ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం

రంగారెడ్డి జిల్లా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది చక్కటి అవకాశమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి, సోనియాగాంధీ నాయకత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చేవెళ్ల నియోజకవర్గ సమావేశంలో పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఇతర ముఖ్య నాయకులూ పాల్గొన్నారు.

### దొంగలను తీసుకు రాకండి: రేవంత్‌కుకేఎల్‌ఆర్ విజ్ఞప్తి

"మీరు డోర్ తెరుస్తం.. డోర్ తెరుస్తం అంటున్నరు. పార్టీని మోసం చేసిన దొంగలను కూడా మీరు లోపలికి తీసుకువస్తే.. మా లాంటి నాయకులు మళ్లీ చచ్చిపోయే ఛాన్స్ ఉంది. కార్యకర్తలూ చచ్చిపోయే ఛాన్స్ ఉంది" అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి పార్టీ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నివేదించారు. అక్కడక్కడా రేవంత్‌రెడ్డి, కేఎల్‌ఆర్‌కు పడదని అనుకుంటున్నారని, మనిద్దరం దగ్గర మిత్రులమన్న సంగతి మీరే చెప్పాలని సీఎంను కోరారు. ఈ విషయం తాను చెబితే జనం నమ్మేట్లు లేరన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో తన అభిప్రాయాలు వినిపిస్తూ కేఎల్‌ఆర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వీడియో క్లిప్పింగ్ మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### జనజాతర ఏర్పాట్లపై 29న టీపీసీసీ భేటీ

జన జాతర పేరుతో తుక్కుగూడలో నిర్వహించనున్న రాహుల్‌గాంధీ సభకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 29న గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యవర్గం సమావేశం కానుంది. ఇదే సమావేశంలో బూత్ స్థాయి నుంచి లోక్‌సభ స్థాయి వరకు మూడంచెల సమన్వయ కమిటీల వ్యవస్థ ఏర్పాటుపైనా కసరత్తు జరగనుంది. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియా ముఖంగా నేతలు మాట్లాడకుండా ఈ సమావేశం వేదికగా ప్రకటన చేయనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాల పైనా చర్చించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ కార్యవర్గం హాజరు కానుంది. ఈ సమావేశం ఏర్పాట్లపైన తనను కలిసిన టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ట్యాపింగ్ మంటలు.. అగ్రనేతల కన్నెర్ర..!

మొదటిపేజీ తరువాయి..

ముద్దాయిగా మాజీ మంత్రి హరీశ్‌రావును, మూడో ముద్దాయిగా అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని చేర్చాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు అప్పటి డీజీపీని కూడా ముద్దాయిగా చేర్చాలన్నారు. మంగళవారం సంగారెడ్డి సమీపంలోని కందిలో బీజేపీ జిల్లా కార్యాలయంలో రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికలోనూ బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. బీజేపీ నేత బీఎల్ సంతోష్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసి కేసుల్లో ఇరికించారని ఆరోపించారు. ఇందులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాత్ర కూడా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయని, ఆయనను కూడా అరెస్ట్ చేసి విచారించాలని కోరారు. "ఐన్యూస్ చానల్ ఎవరిది? ఆయనను ఎందుకు అరెస్ట్ చేయట్లేదు? చానల్‌ను ఎందుకు సీజ్ చేయట్లేదు?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తరువాత హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లిన సందర్భంలో.. ఈ నెల 19న విమానంలో హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య రెండు గంటలపాటు చర్చలు జరిగాయని రఘునందన్‌రావు అన్నారు. ఆ చర్చల నేపథ్యంలోనే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాస్‌పోర్ట్‌లను వెంటనే సీజ్ చేయాలని.. హరీశ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై వెంటనే క్యాబినెట్ తీర్మానం చేసి సీబీఐకి అప్పగించాలన్నారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

### కఠినచర్యలు తీసుకోవాలి..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తాను కూడా బాధితుడినేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. తనతోపాటు తన కుటుంబసభ్యులు, సన్నిహితుల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారని.. మహబూబ్‌నగర్ జిల్లాలోనే వందల మంది బాధితులు ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఫోన్లు ట్యాప్ చేయడమే కాక.. వాటి ద్వారా ఎంతోమంది వ్యక్తిగత అంశాలను సేకరించి, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తునకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని డీజీపీని కోరారు. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వ ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు.. బాధ్యులందరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు యెన్నం శ్రీనివాసరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం యెన్నం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు తన ఫోన్ ట్యాప్ చేశారని.. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాల్ని డీజీపీకి అందించానని చెప్పారు. బాధితులంతా ముందుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు కూడా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఫోన్ ట్యాపింగ్ చేయించడం ద్వారా కల్వకుంట్ల కుటుంబం అతిపెద్ద నేరానికి పాల్పడిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని, ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే కేటీఆర్ తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించుకుని.. చేయని పాపం లేదని విమర్శించారు. అధికార దాహంతో ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడిన కల్వకుంట్ల కుటుంబంపై ప్రజలు తిరగబడి.. ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని దుయ్యబట్టారు. తన చెల్లి కవితలాగానే కేటీఆర్ కూడా జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని దయాకర్ వ్యాఖ్యానించారు.

# తగ్గిపోతున్న నీటి నిల్వలు

### డెడ్ స్టోరేజీకి శ్రీశైలం జలాశయం
### తెలుగు రాష్ట్రాలకు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులే
### కేఆర్ఎంబీ విజ్ఞప్తులను పట్టించుకోని రెండు రాష్ట్రాలు

హైదరాబాద్,మార్చి26(వెలుతురు): నంద్యాల జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగు త్రాగునీరందించే శ్రీశైలం జలాశయం.. ఇప్పుడు నీటి నిల్వలు తగ్గిపోయి వెలవెలబోతుంది. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు తెలుగు రాష్ట్రాలకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వాలు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరించడమే ఇందుకు కారణం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అవసరం 215 టీఎంసీలకు గాను.. ఇప్పుడు మిగిలింది 34 టీఎంసీలే పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడం జలాశయంలో నిటి నిల్వలు తగ్గిపోయాయి. కేఆర్ఎంబీ విజ్ఞప్తులను రెండు రాష్ట్రాలు పట్టించుకోలేదు. అవసరం లేకున్నా విద్యుదుత్పత్తి చేయడమే శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజికి కారణం అంటున్నారు అధికారులు. డెడ్ స్టోరేజికి చేరువలో శ్రీశైలం జలాశయం చేరుకుంది. డ్యామ్ లో నిటినిల్వలు తగ్గిపోయాయి. ఇక ఈ ఎండాకాలం సీజన్ లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇందుకు కారణం ఇరు తెలుగు రాష్ట్రాలు పోటాపోటీగా జలవిద్యుదుత్పత్తి చేయడమే. గత వర్షాకాలంలో సీజన్ లో నిండుకుండలా శ్రీశైలం జలాశయం నిండుకుంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీల సామర్థ్యానికి గాను..ఇప్పుడు 34 టీఎంసీల డెడ్ స్టోరేజీ స్థాయికి నీటి నిల్వలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటి అవసరాలున్నప్పుడు మాత్రమే జలవిద్యుత్తును ఉత్పత్తి చేయండి. అనవసరంగా విద్యుదుత్పత్తి వద్దు" అంటూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ ఎంబీ) చేసిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి%ా% ఇరు తెలుగు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను ముందే ఊహించిన కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాలను హెచ్చరిస్తూ పలుమార్లు లేఖలు రాసింది. చివరికి బతిమాలుతూ జలవిద్యుత్తును నిలిపివేయాలని కోరింది. తాగు, సాగు నీటి అవసరాల కోసం మాత్రమే జల విద్యుత్తు ఉత్పత్తి జరగాలి. కానీ, సాగు, తాగునీటి ఆవసరాలకు లేకుండా శ్రీశైలంలో జలవిద్యుత్తును ఉత్పత్తి చేయడంతో విలువైన నీరు దిగువకు వెళ్లిపోయింది. రానున్న



రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. శ్రీశైలం జలాశయంలో గత ఏడాది మార్చి 26 ఇదే సమయానికి 809.60 అడుగులుగా 34.4273 టి.ఎం. సి. జలాశయంలో నీరు ఉంది. అయితే, ప్రస్తుతం ఇవాళ శ్రీశైలం జలాశయం నీటిమట్టం 810.70 అడుగులుగా ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 810. 70 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 34.6979 టీఎంసీలుగా నమోదైంది. అయితే శ్రీశైలం జలాశయం ప్రస్తుతం నీరులేక అడుగంటిపోయింది.

## బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
# ప్రియదర్శిని మేడి



**వెలుతురు న్యూస్, రామన్నపేట యాదాద్రి జిల్లా**
బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రియదర్శిని మేడి ని మంగళవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో బెహెన్ జీ కుమారి మాయావతి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ నియమించారు. తెలంగాణ చీఫ్ గా ఉన్న ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ రాజీనామా నేపథ్యంలో పార్టీ పట్ల విధేయత కలిగిన వారికి, రాజీ పడని వారికి అవకాశమిస్తే బహుజన వాదం గెలుస్తుందన్న ఆలోచనతోనే ఈ నియామకం జరిగినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రియదర్శిని మేడి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి నకిరేకల్ నియోజకవర్గంలో గడపగడపకు ఏనుగు గుర్తును ప్రజల గుండెల్లోకి తీసుకెళ్లామన్నారు.బహుజనుల కోసం కొట్లాడే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ అన్నారు. బహుజనులంతా ఏకతాటిపై వచ్చి అన్ని రంగాల్లో తమ వాటా సాధించుకోవాలన్నారు. తనకు రాష్ట్ర కమిటీ లో చోటు కల్పించిన నేషనల్ కో ఆర్డినేటర్ రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతం , రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ మరియు నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దళిత సంక్షేమ సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుగా నియామకమైన సునీల్ సులేమాన్

**మునుగోడు, వెలుతురు మార్చి 26:**
తెలంగాణ దళిత సంక్షేమ సంఘం మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడిగా జీడిమడ్ల సునీల్ సులేమాన్ ఎన్నికయ్యారు..ఈ మేరకు నియామక పత్రాలు రాష్ట్ర అధ్యక్షుడు



గుర్రాల పరమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉబ్బపల్లి కాశయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరటి మల్లేష్, జిల్లా అధ్యక్షులు పోలే రవి, MRPS మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్, సాగర్ నియోజకవర్గ ఇన్చార్జి, లింగాల ప్రభాకర్, ప్రవీణ్, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**భువనగిరి వెలుతురు మార్చి 26:**
కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రోజున యాదాద్రి భువనగిరి లో నివాళులర్పిస్తున్నా ఏంవిఆర్ తదితరులు పాల్గొన్నారు.



## మఖ్దూమ్ భవన్‌లో ఘనంగా బొమ్మగాని ధర్మభిక్షం 13 వ వర్ధంతి

**వెలుతురు హైదరాబాద్ మార్చి 26:**
హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూమ్ భవన్‌లో మంగళవారం వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కమ్యూనిస్ట్ నేత బొమ్మగాని ధర్మభిక్షం 13 వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, అఖిల భారత గీత పనివారల సంఘం




జాతీయ అధ్యక్షులు, ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్, గీత పనివారల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి. సాయిలు గౌడ్, రాష్ట్ర నేతలు బి. నాగభూషణం, ప్రముఖ రచయిత కవి కెవిఎల్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, ప్రజాపక్షం ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ అనిల్ కుమార్, సీనియర్ జర్నలిస్టులు సంతోష్, వెంకటేష్, సిహెచ్ జంగయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు 26 మార్చి:**
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమది ప్రజా పాలన అని చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవంలో అలా జరగడంలేదని ఒకే సామాజిక వర్గానికి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయనిఅదేవిధంగా, 60% పైగా ఉన్న బీసీలకు






మొండిచేయి ఎదురవుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ఆగడాలు భరింపలేక ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా నెత్తిన మోసి గెలిపించుకుంటే, సీఎం రేవంత్ రెడ్డి తన సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ బీసీలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్ పార్టీ గుణపాఠం నేర్చుకున్నట్లుగా రానున్న పార్లమెంట్ ఎన్నికలలో 6 సీట్లు కేటాయించడం మంచి పరిణామంగా ప్రశంసించారు. అదేవిధంగా బిజెపి 17 స్థానాలకు గాను బీసీలకు 5 టికెట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కే గణేష్ చారి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో కీలకపాత్ర వహించిన బీసీలకు పార్లమెంటు ఎన్నికలలో 9 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల కోరుకున్న మార్పు అధికారంలో జరగాలి తప్ప దొరలు పోయి పటేల్ రాజ్యాన్ని బీసీ ఎస్సీ, ఎస్టీలు కోరుకోలేదని ఎద్దేవ చేశారు. అసెంబ్లీకి ఎన్నికల్లో డబ్బు లేదని బీసీలను పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికలలో కూడా ఇదే మంత్రం జపిస్తే బీసీలు మౌనంగా ఊరుకోరని కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని వివరించారు. ఇటీవల ప్రకటించిన 37 కార్పొరేషన్ల చైర్మన్లలో ఐదు శాతానికి తప్పు ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి అప్పుదికంగా 17 స్థానాలు కేటాయించడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల వ్యతిరేకిగా ముద్ర వేసుకున్నారని తెలియజేశారు. ఉదయపూర్ డెకరేషన్ ప్రకారం ప్రతి ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాలన్న నిర్ణయాన్ని ఆ పార్టీ తుంగలో తొక్కడం ఏ విధంగా సభబని ప్రశ్నించారు.

పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు చేసిన జోడో యాత్రలో 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు అధికారం ఇంకా అందని మాని పండుగ ఉందని ఇకనైనా ఆ పరిస్థితులు మారాలని కాంక్షించారు. కానీ రాష్ట్ర స్థాయిలో అదే పార్టీ నాయకులు పార్టీ అధిష్టానం ప్రకటించిన నియమ నిబంధనలను అతిక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ అధికారంలో దక్కాల్సిన వాటా తప్పకుండా అందాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్ష ఎన్నికలలో బీసీలు డబ్బు ఖర్చు పెట్టలేరని చెబుతున్న అధికార పార్టీ కార్పొరేషన్ల చైర్మెన్ల కేటాయింపు విషయంలో కూడా బీసీలకు ఎందుకు ద్రోహం చేస్తుందని నిలదీశారు. అది సీఎం చేతిలో ఉండే పనే కదా బీసీలంతా గత ప్రభుత్వాన్ని దించడానికి కాంగ్రెస్ను భుజాన్ని మోసారు, అయినప్పటికీ బీసీలకు అధికారం పంచడంలో తాత్సారం చేయడంలో కారణం తెలియజేయాలని అన్నారు. లేనిపక్షంలో బీసీల ఆగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ చవి చూడవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు బొమ్మగని ధర్మభిక్షం 13వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుందుర్తి గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## నన్ను ఓడించేందుకు
# కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు

- ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టండి
- దేశమంతా మోదీ గాలి వీస్తోంది
- మోదీ వర్సెస్ రాహుల్ గాంధీ మధ్యే ఎన్నికల వార్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు సైతం మోదీ ప్రభుత్వమే కొనసాగాలనుకుంటున్నరు
- రాష్ట్రంలో ఖజానా ఖాళీ.... జీతాలకు డబ్బులిచ్చే పరిస్థితి లేదు
- బీజేపీ ఎంపీలను గెలిపిస్తేనే తెలంగాణకు అత్యధిక నిధులు తీసుకొచ్చే అవకాశం
- జాయినింగ్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి
- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్
- బీజేపీ మండల ఇంఛార్జీలకు దిశానిర్దేశం చేసిన బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు మార్చి 26:**
"పార్లమెంట్ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా కరీంనగర్ లో బీజేపీ భారీ మెజారిటీతో గెలుస్తుందని నివేదికలొస్తున్నయ్. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై నన్ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నయ్. స్థానిక సమస్యలపైన ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు వాటి పరిష్కారంలో గత బీఆర్ఎస్ తోపాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి"అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ పార్టీ నేతలను కోరారు. నరేంద్రమోదీ వర్సెస్ రాహుల్ గాంధీగా పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయని ఇదే అంశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు.

మంగళవారం రోజున మధ్యాహ్నం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఇంఛార్జీలతో బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.విఠల్, జిల్లా ఇంఛార్జీ మీసాల చంద్రయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే...

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉంది. అన్ని సర్వే నివేదికలు ఇవే చెబుతున్నాయి. బీజేపీ గెలుపులో ప్రధాన భూమిక మీదే. పోలింగ్ నాటికి ప్రతి ఓటర్‌ను 7 సార్లు కలవాలి. పోలింగ్ ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించాలి.

కరీంనగర్‌లో సర్వే చేస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఈసారి బీజేపీ గెలవాలని కోరుకుంటోంది. ఎందుకంటే కేంద్రంలో మోదీయే ఉండాలని భావిస్తున్నారు. దీనికితోడు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్ల నిర్మాణానికి అత్యధిక నిధులు తెచ్చింది నేనే. ఈ విషయాన్ని ప్రజల్లో చర్చ ఉంది.

ఇక కాంగ్రెస్ విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీ అయ్యింది. ఎన్నికల తరువాత ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనం కాబోతోంది. అప్పులకు వడ్డీ కట్టే పరిస్థితి లేదు. వీటితో పాటు ఎన్నికల హామీలు అమలు పెద్ద ఎత్తున నిధులు చాలా అవసరం. మోదీ ప్రభుత్వాన్ని గెలిపిస్తేనే తెలంగాణకు అవసరమైన నిధులు రాబట్టుకునే అవకాశం ఉందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

ముఖ్యంగా 6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాలను ఊరూరా ప్రస్తావించండి.బండి సంజయ్ ను గెలిపించాక మీ కోసం కొట్లాడిండు వందల కేసులు పెట్టినా, జైలుకు పోయినా వెరవలేదు పోరాడిండు బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావాలనుకున్నడు కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈసారి సంజయ్ ను భారీ మెజారిటీతో గెలిపించి పోరాడే నాయకులకు అండగా ఉంటామనే సంకేతాలను పంపాలని కోరండి. ఈ విషయంపై ఇంటింటికీ ప్రచారం చేసేలా వాతావరణం ఏర్పరచండి...


జాయినింగ్స్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి. బూత్ కమిటీలను పటిష్టం చేయాలి. పన్నా ప్రముఖ్ లను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాలి. స్థానిక సమస్యల పరిష్కారంలో గత బీఆర్ఎస్ తోపాటు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాలి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమక్కు రాజకీయాలను ప్రస్తావించాలి. పొన్నం, కేటీఆర్ ఒక్కటే. బండి సంజయ్‌ను ఓడించడానికి ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించాలి.

# సీజ్ చేసిన మద్యాన్ని అక్రమ తరలింపు

### గమనించిన స్థానికులతో అధికారులు..డీలింగ్...

**తొర్రూర్, 26 మార్చి,వెలుతురు:**
ఎక్సైజ్ శాఖలో ఇంటి దొంగలే రాజ్యమేలుతున్నారు. అక్రమాలను అరికట్టాల్సిన సిబ్బందే.. తప్పుదారి పట్టి అక్రమార్జనకు తెరలేపుతున్నారు. అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి తదితరాలను నియంత్రించి ప్రజలను కాపాడాల్సింది పోయి.. ఎక్సైజ్ సిబ్బందే ఎంచక్కా గతంలో పట్టుబడిన మద్యాన్ని దారి మళ్లించిన ఘటన వెలుగులోకి వచ్చింది.మహబూబాబాద్ జిల్లా తొర్రుర్ పట్టణ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గతంలో పట్టుబడిన భారీ మద్యాన్ని సీజ్ చేసిన విషయం అందరికి తెలిసిందే...కానీ సీజ్ చేసిన మద్యాన్ని పక్క త్రోవ పట్టించడానికి ఎక్సైజ్ అధికారులు పట్టంకట్టుకున్నారు.. గతంలో ఎక్సైజ్ అధికారుల సోదాల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఒక్క ఆటో(%ూా03ఖూా%6275) సహాయంతో స్థానిక పట్టణ



కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం దగ్గర నుండి సీజ్ చేసిన మద్యంను తీసుకెళ్తుండగా..ఇద్దరు స్థానికులు వీడియోలు ఫోటోలు తీసి..ఆ సీజ్ చేసిన మద్యాన్ని పట్టణ కేంద్రంలోని భద్రకాళి వైన్స్ కు ఇద్దామని ఎక్సైజ్ అధికారులు వెళ్ళగా..భద్రకాళి వైన్స్ దగ్గరకు ఆ ఇద్దరు స్థానికులు ఆటోను వెంబడించగా..స్థానికులు సీజ్ చేసిన మద్యాన్ని ఎక్కడికి తరలిస్తున్నారని అడుగుతున్న క్రమంలో గమనించిన.. భద్రకాళి వైన్స్ యజమాని మా షాపులో వద్దంటే వద్దని చెప్పగానే... మరో వైన్స్ షాపుకు తరలించినట్లు సమాచారం.వెంటనే ఎన్ఫోర్స్మెంట్ అధికారులు స్పందించి అక్రమానికి పాల్పడిన ఎక్సైజ్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదేవిధంగా తరలిస్తున్న మద్యాన్ని చూసిన స్థానికులతో.. డీలింగు మాట్లాడుకున్నట్లు సమాచారం... ఈ అంశాలన్నీ క్లుప్తంగా తెలియాల్సి ఉంది... మరో షాపు కు తరలించిన ఆధారాలు కూడా తెలియాల్సి ఉంది.

# సంపాదకీయం..

## ఎంతకాలమిా పర్యావరణ విధ్వంసం!

దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. మంచినీటి కొరత, సాగునీటి కొరత తీవ్రంగా మారింది. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేసారు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలురాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు.

చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగు తోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టాం. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. ఇంతకాలం మొక్కలు నాటేందుకు కొందరు చేసిన ప్రయత్నాలు..కేవలం ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అని ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరిస్తున్నా ప్రజలు చలించడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కరోనాతో గత రెండేళ్లపాటు పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేశారు. పరిసరాల ను ఎప్పటి కప్పుడు క్లీన్ చేయిం చారు. వీధులను శానిటైజ్ చేసే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. సెకండ్ వేవ్ అంతకన్నా తీవ్రంగా ఉన్నా ...థర్డ్‌వేవ్ అంతంతమాత్రంగానే ముగియడంతో మళ్లీ యధాతథ స్థితికి వచ్చారు. ముందులాగా పారిశుధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. ప్రజలను వారి మానాన వారిని వదిలేశారు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్నట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండిపోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పు లతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉత్తరభారతం అయితే మరీ నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే..ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రచండ భానుడి ప్రతాపానికి దేశం అల్లాడుతోందని ఊరుకుంటే ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే కరోనాలాంటి వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి. మంచి అలవాట్లను ఊరూవాడా విస్తరింప చేసుకోవాలి.

## ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు

మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. ఎవరు ఉన్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది. ప్రాజెక్టులు, మేఘమథనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు.



గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో జరిగిందని చెప్పడానికి అనుమానాలు అక్కర్లేదు. ఖర్చులకూ సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నడిచాయి. కానీ ఇప్పుడు తెలంగాణలో వాస్తవాలకు దగ్గరగా లెక్కలు వేశారు. మనగురించి బడ్జెట్‌లో చర్చించారన్న భరోసా ఆయా వర్గాలకు కలిగింది. సామాజికాభివృద్ధిని ఆర్థిక కోణంలోనే చూడలేము. పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే కొలమానం కాదు. సమాజ సంపూర్ణ వికాసమే అసలైన అభివృద్ధి అని గుర్తిస్తేనే ముందుకు సాగుతాం. కోట్లాది శ్రమజీవులు స్వాభిమానంతో జీవించాలనే, సాధికారత సాధించాలనే తెలంగాణలో సిఎం కేసీఆర్ ఆకాంక్షను బడ్జెట్ ప్రతిబింబిస్తున్నది. గ్రామీణ శ్రామిక సమాజ శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగంలోకి తేవడానికి ఇంతటి బృహత్ ప్రయత్నం సాగడం స్వాగతించాలి.

అభివృద్ధి ముసుగు తొడిగిన విదేశీ ఆర్థికవేత్తల సలహాలు, ఆధునికత పేర అడుక్కు తెచ్చుకున్న ఆర్థిక నమూనాలు కాదు మనకు కావలసింది. మన సమస్యలకు మన దేశీయ విధానాలలోనే పరిష్కారం సాధించాలన్న దృక్పథంతో ముందుకు సాగుతున్న తీరు ముదావహం. గ్రామీణ సమాజంలో అపారంగా ఉన్న మానవ వనరులను, వృత్తి నైపుణ్యాన్ని తగురీతిలో ఉపయోగంలోకి తేవడమే లక్ష్యమని గమనిస్తే తెలిసిపోతుంది.

## అమరావతి ఉద్యమానికి తాత్కాలిక తెర

రాజధాని అమరావతి ఉద్యమానికి ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసుల సూచన మేరకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు సమన్వయ కమిటీ, అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. అమరావతి ఉద్యమ కారులకు, మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, దళిత, మైనారిటీ జేఏసీ సభ్యులకు, లీగల్ అండ్ ఫైనాన్స్ కమిటీ సభ్యులకు, శిబిర నిర్వాహకులకు ఈ మేరకు ఐక్య కార్యాచరణ సమితి నుంచి ఆదేశాలు అందాయి. 1560 రోజులుగా ఎన్ని అవాంతరాలు, అణచివేతలు ఎదురైనా అప్రతిహతంగా అమరావతి ఉద్యమం కొనసాగింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసు సూచనల మేరకు బహిరంగ సమిష్టి నిరసన కార్యక్రమాలకు తాత్కాలిక విరామం ప్రకటించారు. ఉద్యమకారులు కరోనా లాక్ డౌన్ సమయంలో నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. అదే విధంగా తమ ఇళ్ళ వద్దే నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా ఐక్యకార్యాచరణ సమితి విజ్ఞప్తి చేసింది. తదుపరి కార్యాచరణను పరిస్థితులకు అనుగుణంగా ప్రకటిస్తామని జేఏసీ తెలిపింది. రోజులు.. వారాలు.. నెలలు.. సంవత్సరాలు.. కాలగమనంలో కరిగిపోతున్నాయి.. కానీ అన్యాయంపై అమరావతి అన్నదాతలు సాగిస్తున్న సమరం నిరంతరంగా సాగుతూనే ఉంది. కరోనాలు, లాక్‌డౌన్‌లు, తుఫానులు, విలయాలు, పోలీసుల దౌర్జన్యాలు, దాష్టీకాలు, కేసులు, అరెస్టులు, వేధింపులు, లాఠీల దెబ్బలు, తూటాల వంటి మాటలు ఇలా ఎన్ని ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా అమరావతి అన్నదాతలు సాగిస్తున్న పోరాటం సాగుతూనే వచ్చింది. 1560 రోజులుగా రాజధాని రైతులు, కూలీలు అమరావతి కోసం పోరాడుతూనే ఉన్నారు. రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత, బహుజన బిడ్డలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని సాగిస్తూనే ఉన్నారు. పోలీసుల నిర్బంధాలు, లాఠీల దెబ్బలు , గాయాలు.. ఏవీ వారి పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి.

అందుకే ఆ మహా మహోద్యమం మరిచిపోలేని విజయాలతో ముందుకు సాగింది. దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచిపోయింది. రాజధాని అమరావతిని కాదని వైసీపీ ప్రభుత్వం.. మూడు రాజధానుల ప్రకటన చేసింది మొదలు రాజధాని రైతులు ఉద్యమానికి దిగారు. అయితే, వీరి ఉద్యమాన్ని ఎప్పటికప్పుడు భగ్నం చేసేందుకు సర్కారు చేయని ప్రయత్నం లేదు. మహిళలు స్నానం చేసే సమయంలో డ్రోన్ కెమేరాలు తిప్పి.. దీనిని అడ్డుకున్న 40 మందిపై కేసులు పెట్టి 20 రోజులపాటు జైలుపాలు చేసింది ఇప్పటి వరకూ 2600 మందిపై 600కు పైగా కేసులు బనాయించారు. నాలుగేళ్లలో 250 మంది రైతులు గుండెలు పగిలి చనిపోయారు. బెదిరించడం, భయపెట్టడం, అవమానపరచడం, లేదంటే రెచ్చగొట్టడం, అదీ కాదంటే అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో కుక్కడం.. ఇలా రోజుకో రకంగా రైతులను వేధించారు. అయినా



రైతులు వెనక్కి తగ్గలేదు. ఈక్రమంలో ఇసి ఆదేశాల మేరకు రాజధాని అమరావతి ఉద్యమానికి ఎన్నికల సంఘం ఆదేశాలు పోలీసుల సూచనమేరకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు సమన్వయ కమిటీ, అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది.

అమరావతి ఉద్యమకారులకు, మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, దళిత, మైనారిటీ జేఏసీ సభ్యులకు, లీగల్ అండ్ ÷నాన్స్ కమిటీ సభ్యులకు, శిబిర నిర్వాహకులకు ఈ మేరకు ఐక్య కార్యాచరణ సమితి నుంచి ఆదేశాలు అందాయి. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రైతులు దీక్షలను నిలిపివేశారు. ఈ మేరకు అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి), సమన్వయ కమిటీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రాజధాని గ్రామాల్లోని రైతు దీక్షా శిబిరాల్లో ఆందోళనలకు తాత్కాలికంగా బ్రేక్ పడడంతో మంగళవారం నుంచి ఇళ్ళ వద్దనే నిరసనలు కొనసాగించాలని రైతు జెఎసి, సమన్వయ కమిటీ నిర్ణయించాయి.

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజధాని గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు, మహిళలు దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. వెంకటపాలెం, మందడం, వెలగపూడి, తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం రైతు దీక్షా శిబిరాలలో దీక్షలు సాగుతున్నాయి. సోమవారం తో దీక్షలు 1560వ రోజుకు చేరగా ఎన్నికల నేపథ్యంలో శిబిరాల్లో దీక్షలకు రైతు సంఘాలు తాత్కాలికంగా విరామం ప్రకటించాయి.

## వేసవి వస్తోందంటే
# ఏటా నీటికి కటకటలు

వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతను ఎదు ర్కొంటున్నాయి. సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని మున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పునఃపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా




వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్ధాలకు అడ్డుకట్ట వేయాలి. నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కలు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఈ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు.

ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యత లేని సమయంలో ఎగువ రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని వాడుకుంటే కిందికి చుక్కరాదు. దిగువ రాష్ట్రం అనివార్యంగా నష్టపోవాల్సిందే. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు.

## మండుటెండలు..రాజకీయ ప్రచారాలు

మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. ఎండాకాలం ఎన్నికలతో పార్టీల నేతలు మొదలు కార్యకర్తలు నానా హైరాన పడుతున్నారు. ఎన్నికల పోరులోకాంగ్రెస్ పార్టీ కూడా ఇందుకు సమాయత్తం అవుతోంది. ఎపిలో టిడిపి ఉమ్మడిగా పోరాటం చేపట్టింది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలతో పాటు ఇతర చిల్లర పార్టీలకు కూడా ఈ యాతన తప్పడం లేదు. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు ఎన్నికల్లో పోటీకి రాజకీయ పార్టీలన్నీ ఇప్పటి నుంచే వ్యూహాలు రూపొందిస్తు న్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి. ఇప్పటి నుంచే పట్టుపెంచుకునేందుకు కాంగ్రెస్, కొన్నిచోట్లనైనా ఖాతా తెరిచేలా భాజపా ఇలా ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపోతున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు. మొత్తంగా రాజకీయాపార్టీలు తమాం దోళనా కార్యక్రమాలతో ఎండలకు మించి పరీక్ష పెడుతున్నాయి. మొత్తమ్మీద మళ్లీ పార్టీల హడావిడితో రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికల వేడి మొదలు కానుంది. మొత్తంగా జిల్లాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకేసారి అన్ని పార్టీలు రోడ్లపైకి వస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అధికార పార్టీకి ధీటుగానే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర నేతలు, మంత్రులు కావాలనే కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఈ ధర్నాలో ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ పోరాటాలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ ధర్నాలు చేస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీల కార్యకర్తలు ఇక ఎండలను లెక్క చేయకుండా రోడడ్డెక్కాల్సిన ఆగత్యం ఏర్పడింది. రాజకీయంగా సత్తా చాటాలనుకుంటున్న లీడర్లు ఈ బాధ్యతను భుజాన వేసుకోక తప్పదు.






## బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన
# కెపిహెచ్ బి మహిళలు..

**కూకట్‌పల్లి వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్ బి కాలనీకి చెందిన ఎస్ ఎల్ ఎఫ్ లీడర్ సుందరి తన అనుచరులు సుమారు 30 మందితో కాంగ్రెస్ నాయకురాలు రజిత ఆధ్వర్యంలో మంగళవారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ఆకార్షితులై పార్టీలో చేరిన మహిళలకు మరోసారి స్వాగతం పలుకుతున్నాం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

**శేర్లింగంపల్లి, వెలుతురు:**
పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శేర్లింగంపల్లి నియోజకవర్గంలో పార్లమెంటు స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి, నియోజకవర్గ



కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఏకాంత్ గౌడ్, విద్యా కల్పన ఏకాంత్ గౌడ్ లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని, కార్యకర్తలందరూ కష్టపడి పనిచేయాలని సూచించినట్లు ఏకాంత్ గౌడ్ తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బూర నర్సయ్యను
# భారీ మెజార్టీతో గెలిపించాలి

**-ఎలిజాల శ్రీను**



**వెలుతురు న్యూస్ నారాయణపూర్ మార్చి 26:**
వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బూర నర్సయ్య గౌడ్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని భారీ మెజార్టీతో గెలిపించుకొని నరేంద్ర మోడీకి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని నారాయణపురం మాజీ మండల కార్యదర్శి ఎలిజాల శ్రీను అన్నారు భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లేలా చక్కని ప్రణాళికలతో ముందుకు వచ్చిన నేత బూర నర్సయ్య గౌడ్ అని అన్నారు దేశంలో మరోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని బూతులలో భారీ మెజార్టీని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించండి
### ఎంపీడీఓకి విద్యార్థులు వినతి

**వెలుతురు న్యూస్ నారాయణపూర్ మార్చి.26:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు మండల ఎంపిడిఓ కి విద్యార్థులు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి నిధుల నుండి కట్టి గాలికొదిలేశారు.. మాకు మరుగుదొడ్లు సమస్య ఇబ్బందిగా ఉంది అధికారులు స్పందించి మరమ్మత్తులు జరిపి వాటి ని వాడుకలోకి తీసుకొచ్చే విదంగా చూడండి అని విద్యార్థులు కోరారు..ఈ కార్యక్రమంలో సాయి వర్ధన్, మేకని శివ సాయి, మల్లెపల్లి అశ్విన్, హనుమాన్, విడమ్ చంద్రశేఖర్, బొడిగే వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తాం..

**- వి జగదీశ్వర్ గౌడ్**



**శేరిలింగంపల్లి వెలుతురు:**
చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఇంచార్జ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్.జి.రంజిత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలు, చైర్మన్లతో కలిసి పాల్గొని చేవెళ్ల పార్లమెంట్ లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ పిలుపు ఇచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు 7.25 లక్షల పైచిలుకు ఓటర్లతో చేవెళ్లలోనే కాకా తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గంగా ఉండగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షులు ఏ.రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలకు చేవెళ్ల ఇంచార్జిగా వ్యవహరించడం వారి నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజవర్గం నుంచి భారీ మెజారిటి అందించాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ప్రచారంలో భాగంగా వారు ఇచ్చిన మాట నిలుపుకుంటూ అంగవైకల్యం కలిగిన మహిళకు ఉద్యోగం కల్పించడం వారి దయ హృదయాన్ని నిదర్శనం అన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గారంటీలను అమలుపర్చడం, 60 రోజులలోపే మరో రెండు గారంటీలను అమలు రూపం దాల్చడం వారి పాలనా దక్షతను చాటుతుందని కొనియాడారు.

రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 100 రోజుల పనితీరుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ భారీ ఎత్తున కాలనీలు, బస్తిల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు వారి చేరికలతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరిందని, ఈ సారి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడం ఖాయం అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ లోక్సభ అభ్యర్థి డాక్టర్.జి.రంజిత్ రెడ్డి గురించి మాట్లాడుతూ గతంలో రంజిత్ రెడ్డి తో కలిసి పని చేసిన అనుభవం తనకు ఉందని ఆయన మృదుస్వభావిగా, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తిగా చేవెళ్లలో అందరికి సుపరిచితుడని,ఆలాంటి వ్యక్తిని మనకు లోకసభ అభ్యర్థిగా అందించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం నమ్మకాన్ని నిలుపుకునేలా చేవెళ్ల లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు రంజిత్ రెడ్డికి భారీ మెజారిటీ అందించేలా కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి తరుపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేవెళ్లలో భారీ మెజారిటీ అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయడానికి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం కాయం అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి చేవెళ్ల పార్లమెంట్ గెలిచి బహుమతిగా ఇస్తాం అని ఆశాభావం వ్యక్తం చేసారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో
# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**




**కూకట్‌పల్లి వెలుతురు:**
మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 29న కూకట్ పల్లి ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో జరగనున్న పార్టీ సమావేశం సందర్భంగా మంగళవారం బాలనగర్ లోని పార్టీ కార్యాలయంలో రమేష్ ఆధ్వర్యంలో పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్ష వహించిన బండి రమేష్ మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా ఉండటమే పెద్ద పదవి అని ఇలాంటి పార్టీ గెలుపు కోసం పనిచేయడం ప్రతి కార్యకర్త ఒక బాధ్యతగా భావించాలని సూచించారు.

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుండి బ్రహ్మాండమైన ఆదరణ లభిస్తొందన్నారు. గతంలో పార్టీలో కొన్ని చిన్న చిన్న పొరపాట్లు జరిగిన ప్రస్తుతం సీనియర్లు, జూనియర్లు అందర్నీ కలుపుకుంటూ సమన్వయం చేసు కుంటూ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నామన్నారు. పనిచేసే వారికి పార్టీలో ప్రభుత్వంలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీకి చెందిన అన్ని కమిటీల్లోను స్థాని కులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమైతేనే లీడర్‌గా ఎదగగలుగుతారనీ కార్య కర్తలకు సూచించారు.

శుక్రవారం జరిగే కార్యకర్తల సమావేశం విజయవంతం చేసేందుకు పటిష్టంగా కృషి చేయాలి అన్నారు. నియోజక వర్గంలో అందర్నీ సమన్వయం చేస్తూ ఇటు పార్టీ కార్యక్రమాలు అటు ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాను అన్నారు. కూకట్ పల్లి పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. పార్టీ నియోజకవర్గ అభివృద్ధికి సిఎం రేవంత్ రెడ్డి రూ.10 కోట్లు కేటాయించారన్నారు.

అధిష్టానంతో పోరాడి జనాభా ప్రాతిపదికన మరిన్ని నిధులు సాధిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్ప రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మహిళా, నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత...

**పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి**




**కూకట్‌పల్లి వెలుతురు:**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం బస్తీలోని శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ శివాలయంలో ఆవరణలో గల కమిటీ హాల్లో జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి చంద్రా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలోని ప్రతి ఒక్కరు ఇంట్లో నిత్యం పేరుకుపోయే చెత్తాచెదారాన్ని రోజు ఇంటి ముందుకు వచ్చే జిహెచ్ఎంసి చెత్త రిక్షాల్లో వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయడం ద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారి క్రిమి కీటకాలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉందన్నారు . ప్రతి ఒక్కరూ దీనిని దృష్టిలో పెట్టుకుని నిత్యం పేరుకుపోయే చెత్తను చెత్త రిక్షాల్లో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి , కోశాధికారి నరసింహులు ముదిరాజ్, పాపిరెడ్డి నగర్ ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు వి. శోభారాణి, నల్ల పోచమ్మ ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు టి పద్మ , జై హనుమాన్ ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు రేణుక , కార్యదర్శులు వెంకటలక్ష్మి , లక్ష్మి , సంధ్య కోశాధికారి సౌజన్య ,ఆర్పీలు రాణి స్వర్ణలత, స్వాతి, శానిటేషన్ ఎస్ఎఫ్ఐ రాములు డ్రైవర్ లోకేష్, నరసింహ స్లీపర్స్ అలివేలు , వెంకటరమణ, బిందు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవి కిరణ్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసిన మాటూరి శ్రీనివాస్ గౌడ్



**వెలుతురు భువనగిరి మార్చి 26:**
భువనగిరి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆఫీసర్ ఛాంబర్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ ఇ రవి కిరణ్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిసిన రాచకొండ మీడియా క్లబ్( ఫౌండర్) అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్ గౌడ్, ఘట్కేసర్ మీడియా క్లబ్ అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్ మరియు సీనియర్ పాత్రికేయులు కాజా మోహినిద్దిన్ పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

**తుర్కయంజాల్,వెలుతురు:**
తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమని 8వ వార్డు కౌన్సిలర్ మరి మాధవి మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం చైర్పర్సన్ అనురాధ రెడ్డి ఆదేశాల వరకు 35 మంది మున్సిపల్ సిబ్బందితో అరుంధతి కాలనీ , బృందావన్ కాలనీ, వైట్ ఫీల్డ్ పలు కాలనీలలో శుభ్రపరచారు. రోడ్ కి ఇరువైపులా ఉన్న పదులను తొలగించి జెసిపి సహాయంతో గుంతలను పోల్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరు కలిసి రావాలన్నారు. కాలనీవాసులంతా చెత్తను బయట వేయరాదని పురపాలక స్వేచ్ఛ ఆటో కి పొడి, తడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, నాగేష్, హరీష్ , జవాన్ మధు, స్థానిక కాలనీవాసులు, పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజేశ్వరి వృద్ధాశ్రమంలో
# ఉచిత క్షౌర సేవలు...

**కూకట్‌పల్లి, వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ సాయి నగర్ లోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో పంబి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 56వ సేవా కార్యక్రమంలో భాగంగా మార్చి 26, మంగళవారం నాడు, పంబి శ్రీనివాస్, ఆయన కుమారులు కలిసి వృద్ధులకు ఉచిత క్షౌర సేవలు చేయడం జరిగింది.



మానవసేవే మాధవసేవ అనే భావంతో సేవా భావాన్ని చాటుతూ వృద్ధులకు తమ వంతు సేవగా క్షౌర సేవలు అందించడం మనసుకు ఎంతో తృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా పంబి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

# నర్సరీని సందర్శించిన ప్రత్యేక అధికారి మోహన్ మురళి

**జహీరాబాద్, 27 మార్చి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లీ మండల పరిధిలో ఉన్నటువంటి నర్సరీని ప్రత్యేక అధికారి మోహన్ మురళి మంగళవారం తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులకు పలు



సూచనలు చేశారు. వేసవికాలం దృష్ట్యా మొక్కలకు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మోహన్ మురళి మాట్లాడుతూ హరితహారం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నటువంటి స్థానిక పంచాయతీ కార్యదర్శి మల్లేష్ గౌడ్ ను అభినందించారు.

## ఉజ్వల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో
# ఉచిత కంటి ఆపరేషన్లు

**జహీరాబాద్, 26 మార్చి, వెలుతురు:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములో గత నెల రోజుల క్రితం ఉజ్వల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మోగా వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు, రోగులను పరీక్షించి వారికి అవసరమగు ట్రీట్మెంట్ కూడా నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని గ్లోబల్ ఐ హాస్పిటల్ లో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన 4 గురి మహిళలకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించారు. మిగతా కొందరికి అతి త్వరలో కూడా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని డాక్టర్ ఉజ్వల్ రెడ్డి తెలిపారు. జహీరాబాద్ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ అనునిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు.








# పులుమామిడిలో రాజ్యమేలుతున్న సమస్యలు..

**ప్రమాదకరంగా మారిన డ్రైనేజ్ మోరి...!!**
**అర్థాంతరంగా తవ్వి వదిలేసినా మిషన్ భగీరథ పనులు...!!**
**గ్రామ సమస్య పట్టని కార్యదర్శి...!!**
**ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు...!!**
**అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు...!!**
**సమస్య పరిష్కరించాలంటూ విజ్ఞప్తి...!!**

**నవాబుపేట్ (వెలుతురు న్యూస్):**
వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం పులు మామిడి గ్రామంలోని గతం ప్రభుత్వంలో చేసిన మిషన్ భగీరథ పనులు సమస్య వలయంగా మారింది.ప్రభుత్వ పనులు నిర్వహిస్తున్నప్పుడు అధికారుల పర్యవేక్షణ కరువవడంతో గుత్తేదార్లదే రాజ్యమైంది. చేసిన పనులకు క్యూరింగ్ లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. మిషన్ భగీరథ, అండర్ డ్రైనేజ్,సీసీ రోడ్ల నిర్మాణం ఇతర నిర్మాణాలు పర్యవేక్షణ చేయడంలో సంబంధిత



శాఖ అధికారులు గాని ఇంజనీర్ అధికారులు గాని పర్యవేక్షిచడం, పరిరక్షించడంలో విఫలమవుతున్నారనీ గ్రామస్తులు అంటున్నారు.అదేవిధంగా మిషన్ భగీరథ కాంట్రాక్టర్ నీటి పైపులు ఏర్పాటు చేయడానికి గుంతలు తీయడం వల్ల కాలనీ సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి.కాలనీ రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యం వల్ల రోడ్డు నీటితో నిండి ఉంటున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అడిగేవారే లేరు రోడ్డు మీదికి వస్తే దుమ్ము ధూళితో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



ఈ నేపథ్యంలో నాసిరకం నిర్మాణంతో నిధులు వృథా అవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పనుల్లో కనిపించని నాణ్యత...!!**
పనుల్లో పురోగతి మాట అటుంచితే నాణ్యత విషయంలోనూ కాంట్రాక్టర్లు కక్కుర్తి పడుతున్నారు.కాంట్రాక్టర్ల కక్కుర్తి.. అధికారుల అవినీతికి చిహ్నంగా నిలుస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజ్, సీసీ రోడ్డు నిర్మాణాల్లో నిబంధనలు పాటించడం లేదు. ఒక పక్క నిర్మిస్తుంటే.. మరో పక్క పగుళ్లు, రంధ్రాలు పడి అగమ్య గోచరానికి అద్దం పడుతోంది. సర్కారు పనులు జరుగుతున్నప్పుడు క్వాలిటీ కంట్రోల్ శాఖ తనిఖీలు లేవు. ఇంకేముంది.. పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత డొల్లతనం.. అవినీతి మయం కనిపిస్తుంది.

**నిబంధనలు ఏవీ...!!**
డ్రైనేజ్, రోడ్డు పనుల్లో నిబంధనలు పాటించడం లేదు.అయితే ఈ పనుల్లో వాడే కంకర, ఇసుక, సిమెంట్ నాణ్యత లేకపోవడంతో పిండిగా ఉండే కంకర వాడుతున్నట్లు తెలుస్తుంది. కంకర వేసి రోలింగ్ చేసే క్రమంలో వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదు. దీనివల్ల బరువైన వాహనాలు ఈ డ్రైనేజ్ లపై వెళ్లడంతో దెబ్బతింటున్నాయి.

**గ్రామ సమస్య పట్టించుకోని కార్యదర్శి...!!**
పులిమామిడి గ్రామంలో సమస్యలతో సతమంతమవుతున్న




కూడా పంచాయతీ కార్యదర్శి ఆ సమస్యలు తమకు పట్టవన్నట్లు వ్యవహరిస్తున్నరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ ముందే కంకర చెత్త వేయడం దీనికి నిదర్శనం. గ్రామంలో కొన్నిచోట్ల పైకి పెద్దపెద్ద రంధ్రాలతో ప్రమాదకరంగా మారిన మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు.ప్రధాన రోడ్డు పక్కనే డ్రైనేజ్ మోరీ కూలిపోయి ఉండడం కనిపిస్తుంది. ఇవేవీ సమస్యలు తమకు పట్టవున్నట్లు గ్రామపంచాయతీకి అనేకు 11 బజే జానెకు 3బజే అన్నట్లు పంచాయతీ కార్యదర్శి వీధులు నిర్వహించడం చూస్తుంటే ఆయనకు గ్రామ అభివృద్ధిపై ఎంత ఉందో అనేది అర్థమవుతుంది.ఈ పని చేయని పంచాయతీ కార్యదర్శి మాకొద్దని పై స్థాయి అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

# నిజాయితీని చాటుకున్న యువకుడు

**అవనగంటి మహేష్‌ను అభినందించిన ఎస్సై మల్లయ్య**

**వెలుతురు న్యూస్: యాదాద్రి జిల్లా:** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన అవనగంటి మహేష్ తన నిజాయితీని చాటుకున్నాడు.రామన్నపేట కెనరా బ్యాంకు పరిధిలోని ఏటీఎంలో ఈరోజు ఉదయం డబ్బులు విత్ డ్రా కోసం వెళ్లగా అక్కడే అంతకుముందే డ్రా చేసిన వ్యక్తి 9000 రూపాయలు మరిచిపోయి ఉండడం గమనించి ఆ డబ్బులను రామన్నపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై పి. మల్లయ్య కు అప్పచెప్పడం జరిగింది.



తర్వాత డబ్బులు మర్చిపోయిన నీర్నేముల గ్రామానికి చెందిన కట్ట కుమార్ బ్యాంకును సంప్రదించి వివరాలు సి.సి టివిలో చూడగా తన తర్వాత డబ్బులు విత్ డ్రా చేసిన వ్యక్తి వివరాలు తెలుసుకొని అతనితో మాట్లాడగా రామన్నపేట పోలీస్ స్టేషన్లో డబ్బులు అప్ప చెప్పానని చెప్పడంతో స్థానిక ఎస్సై మల్లయ్యను కలవగా డబ్బులు పోలీస్ స్టేషన్లో అప్పజెప్పిన మహేష్ తో డబ్బులను మర్చిపోయిన వ్యక్తికి అప్పచెప్పడం జరిగింది. నిజాయితీని చాటుకున్న మహేష్ ను రామన్నపేట ఎస్సై మల్లయ్య,వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, పులిబిక్షం, అప్పం సురేందర్, పోలీస్ అధికారులు అభినందించారు.

# ఇంటింటికి వెళ్తాం.. ప్రతి ఒక్కరినీ కలుస్తాం...

**- బూత్ అధ్యక్షుడు సంగిశెట్టి నరేష్**

**వెలుతురు న్యూస్, సంస్థాన్ నారాయణపురం:**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ, 99 బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్,జిల్లా నాయకుడు వంగరి రఘు,బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్, పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రతి ఓట రును కలవాలి అన్నారు.ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని తెలిపారు.అనంతరం బూత్ అధ్యక్షులుగా సంఘిశెట్టి నరేష్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా,జెట్టి కృష్ణ,సింగం భాస్కర్,ఉపాధ్యక్షులు,అచ్చినీ ప్రవీణ్,రాపర్తి నవనీత్ కార్యదర్శులు,అచ్చినీ రవి,బద్దం శ్రీరామ్‌ను సోషల్ మీడియా కన్వీనర్‌గా గంజి ఉమాకాంత్, కార్యవర్గ సభ్యులుగా,గుంటి సదానంద్,రాచకొండ కిరణ్,నోకం వంశీ, సోలాపురం కరిష్ణదాస్,చేదురువెల్లి మహేష్, ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.







# అకాల వర్షానికి నేలవాలిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

## రైతులకు ఎకరానికి 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని డీమాండ్

**జహీరాబాద్, 26 మార్చి వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝురాసంగం మండలం కుప్పనగర్ గ్రామంలో అకాల వర్షానికి పాడైన జొన్న, మొక్క జొన్న పంటలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, డీసీఎంస్ చైర్మన్ శివకుమార్ రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడి వర్షానికి పాడైన పంటల వివరాలు తెలుసుకొని వెంటనే జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. ఇంత నష్టం జరిగిన ఏ ఒక్క అధికారి ఇప్పటి వరకు వచ్చి చూసింది లేదు అని నిలదీశారు.

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలలో అకాల వర్షనికి చేతికి వచ్చిన జొన్న, మొక్క జొన్న అలాగే మామిడి పంట్టలు చాలా వరకు రైతులకు కన్నీళ్లు మిగిల్చిన ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఏ ఒక్క నాయకుడు గాని అధికారులు కానీ వచ్చి చూసిన పాపాన పోలేదని ఇది చాలా సిగ్గుచేటని వారన్నారు. ఇప్పటికైనా మంత్రి దామోదర్ రాజానర్సింహా నిద్రమత్తు నుండి లేచి పాడైన పంట పొలాలను పరిశీలించి రైతులకు ఎకరానికి 25 వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఉపాధిహామీ పని ప్రదేశాల్లో
# కనీస సౌకర్యాలు కల్పించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్



**కరీంనగర్ (వెలుతురు):**

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధిహామీ పనులు విస్తృతంగా జరుగుతున్న సంద ర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీటి సౌకర్యం,నీడ సౌకర్యం కల్పించడంతో పాటు,ఓరెస్ ప్యాకేట్స్ పంపిణీ చేయాలని అన్నారు.అలాగే కూలీల పనుల సమయాన్ని 7 గంటల నుండి 11 గంటల వరకు కొనసాగించాలని ఎక్కువ సమయం వరకు చేయించడం వల్ల ఎండ దెబ్బ కొట్టి కూలీలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాపై క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని అన్నారు.మా సంఘం తరుపున ఉపాదిహామీ కూలీల సమస్యలు తెలుసు కోవడానికి పని ప్రదేశాల దగ్గరికి వెల్లుతే కొన్ని గ్రామాల్లో మెట్లు,ఫిక్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండడం లేదని 12 గంటల వరకు ఉండి మేటి వచ్చిన తర్వాత ఫోటో అప్లోడ్ చేసిన తర్వాత కూలీలు ఇంటికి వెళ్లి పరిస్థితి దాపురించిందని అన్నారు.

ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు పనికి ముందు పని అయిపోయిన తర్వాత రెండు సార్లు ఫోటో అప్లోడ్ చేసి పద్ధతిని వేనిక్కి తీసుకోవాలని,వర్షాలు లేక వ్యవసాయేతర భూములు గట్టిగా మారాయని అట్టి ప్రదేశాల్లో కొలతలు పెట్టి కూలీలతో పనులు చేయించడం వల్ల భూమి గట్టిగా ఉండడం వల్ల కొలతల ప్రకారం పనులు చేయక సరైన వేతనం పడక కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని,దీన్ని దృష్టిలో ఉంచు కుని కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థి కంగా ఆదుకోవాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

# నిజాంబాద్ ఎంపీ టికెట్ పద్మశాలి ఈరవత్రీ అనిల్, భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలి

### తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం
### చేనేత, టెక్స్‌టైల్ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌లు నియమించాలి
### చేనేత పథకాలు పునరుద్ధరించాలి
### త్రిఫిట్ ,చేనేత మిత్ర పథకాలకు నిధులు కేటాయించాలి






**హైదరాబాద్ వెలుతురు మార్చి 26:**
తెలంగాణ పాత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తకు మురళి లు మాట్లాడుతూ
నిజాంబాద్ ఎంపీ టికెట్ పద్మశాలి ముద్దుబిడ్డ ఈరవత్రి అనిల్ కు, భువనగిరి ఎంపీ టిక్కెట్ ను కూడా పద్మశాలిలకు కేటాయించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు నిజాంబాద్, భువనగిరి, కరీంనగర్ నియోజకవర్గలలో రెండున్నర లక్షల కు పైగా జనాభా కలిగిన పద్మశాలీలకు టికెట్ కేటాయించాలని ఏకగ్రీవంగా 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు తీర్మానించారు,

అంతేకాకుండా మెదక్, వరంగల్, ఖమ్మం, జహీరాబాద్, నాగర్ కర్నూల్, అదిలాబాద్, నల్లగొండ, మహబూబ్నగర్ ప్రతి లోక్ సభ నియోజకవర్గంలో లక్ష నుండి రెండు లక్షల జనాభా కలిగిన పద్మశాలీలను ప్రతి రాజకీయ పార్టీ గుర్తించి సీట్లు కేటాయించాలని ఈ సభ తీర్మానించడం జరిగింది త్వరలో అన్ని జిల్లాలలో రాష్ట్ర కమిటీ పర్యటించాలని, పద్మశాలిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి , స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించ నైనది. రాష్ట్ర ప్రభుత్వం టేస్కో ద్వారా అమలవుతున్న నేతన్న భీమా చేనేత మిత్ర, త్రీఫ్ట్ ఫండ్, హెల్త్ కార్డు ఒంటి పథకాలకు నిధులు కేటాయించి వాటిని పునరుద్ధరించాలని కోరారు లేని పక్షంలో పోరాటాలకు కూడా సిద్ధంగా ఉంటామని ఈ సందర్భంగా తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే , తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ చేనేత మరియు పవర్ లూమ్ కార్మికుల సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి మురళి తాను కలిసి తీసుకెళ్తామని వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు మాట్లాడుతూ అంతేగాకుండా పద్మశ్రీ గజం అంజయ్య, చేనేత రాష్ట్ర, జాతీయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం ప్రధాన కార్యదర్శి వనం విశ్వనాథం టి పి ఎస్ ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ కోశాధికారి బొమ్మ రఘురాం నేత, మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు పుట్టా పాండురంగయ్య, టిపిపిఎస్ గౌరవాధ్యక్షులు మెతుకు సత్యం, రాజకీయ విభాగం అధ్యక్షులు చాలా రమేష్ అఖిలభారతయువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, తెలంగాణ మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటుక రూప, మీడియా విభాగం అధ్యక్షులు బొమ్మ అమరేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్, యువజన అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, గౌతం, చిన్ని రాకేష్, మరియు కర్నాటి శ్రీనివాస్, పెద్ద జగదీష్ రాపోలు జ్ఞానేశ్వర్, తడక రమేష్ ,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఎన్నికల కోడ్ అమలకు చెందిన ఖేడ్ పట్టణంలో నాలుగు రూట్లలో వెహికల్ చెకింగ్

**వెలుతురు, నారాయణఖేడ్ మార్చ్ 26 :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని పంచగమ్మ కమాన్ వద్ద వానాల తనిఖీ నిర్వహిస్తున్నారు అదేవిధంగా మంగళ పేట్ లోని దుర్గ భవాని దేవాలయం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు



చేస్తున్నారు దీంతోపాటు కంగటి రూట్ లో మన్సూర్ పూర్ లో కరస్ గుత్తి రోడ్ లో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ డబ్బులు ఉన్నాయా లేదా పరిశీలిస్తున్నారు ఈ తనిఖీలు డిఎస్పి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు నారాయణఖేడ్ సీఐ ఎస్ఐ పెద్ద చరణ్ రెడ్డి పలువురు పోలీసులు ఎస్ఐలు తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాదయాత్ర భక్తులకు దుప్పట్లు పంపిణీ

### దత్తగిరి మహరాజ్ పాదయాత్రకు ఘన స్వాగతం పలికిన కాంట్రాక్టర్ రాజు పటేల్

**జహీరాబాద్, 26 మార్చి వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝురాసంగం మండల పరిధిలోని బర్దిపూర్ ఆశ్రమం అవదూత గిరి మహారాజ్ పాదయాత్ర కు కాంట్రాక్టర్ రాజు పటేల్ ఘన స్వాగతం పలికారు. గత వారం రోజులుగా నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో ని బెల్లాపూర్ గ్రామం నుండి పాదయాత్ర



ప్రారంభించారు. పాదయాత్ర కు భక్తులు అడుగు అడుగున స్వాగతం పలుకుతూ స్వామి వారి ఆశీర్వాదములు తీసుకున్నారు. జహీరాబాద్ లోని ఎన్ కన్వెన్షన్ ఆవరణలో కాంట్రాక్టర్ రాజు పటేల్ దంపతులు అవదూత గిరి మహరాజ్ చేతుల మీదుగా భక్తులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా అవదూత గిరి మహరాజ్ రాజు పటేల్ దంపతుల సేవలను అభినందించారు.

# కర్ణాటక ప్రభుత్వ చీఫ్ విప్ సలీం అహ్మద్‌ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, పెద్దగోని రమేష్ గౌడ్

**నారాయణపూర్ మార్చి 26,వెలుతురు న్యూస్:**
సంస్థాన్ నారాయణపురం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రియ మిత్రుడు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి) జనరల్ సెక్రెటరీ, కర్ణాటక ప్రభుత్వ చీఫ్ విప్ సలీం అహ్మద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, పెద్దగొని రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రణీత్ రావు నాకు తెలియదు

- విజయ్ మాకు బంధువు కాదు
- ఓటు నోటుకు కేసు..నాకు ఎటువంటి సంబంధం లేదు
- చరణ్ చౌదరి ఎవరో నాకు తెలియదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




హైదరాబాద్, మార్చ్ 25,(వెలుతురు): నా మీదా చరణ్ చౌదరి ఆరోపణలు చేశారు, పిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. చరణ్ చౌదరి ఎవరో నాకు తెలియదు.అతను బిజెపిలో ఉండి భూ కబ్జాలు చేస్తున్నాడని పార్టీ నుండీ సస్పెండ్ చేసింది.ఎన్ఐఆర్ వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకొని మోసాలు చేస్తుండు.విజయ్ అనే వ్యక్తి ని అంతే మోసం చేశాడు.

ఎన్ఐఆర్ వాళ్లు అందరు నాకు పరిచయస్తులు.చరణ్ పై చాలా కేసులు ఉన్నాయి.దొంగ పత్రాలు పెట్టి కబ్జాలు చేయటం, అనేక కేసులు అతనిపై ఉన్నాయి.40 యేండ్ల పాటు రాజకీ యాల్లో ఉంటున్న, నాపై ఎటువంటి మచ్చ లేదు.వాస్తవాలు తెలుసుకొని ప్రెస్ మిత్రులు వార్తలు రాయాలి. విజయ్ అనే వ్యక్తి మా బంధువని వార్తలు రాస్తున్నారు, విజయ్ మాకు బంధువు కాదు.

ప్రణిత్ రావు ఎవరో నాకు తెలియదు. మా ఫ్రెండ్స్ పై పార్టీ మారమని ఒత్తిడి తెస్తున్నారు. ఎంత ఒత్తిడి తెచ్చిన నేను పార్టీ మారేది లేదు. రాజశేఖర్ రెడ్డి హయంలో పార్టీ మారమని ఎంతో ఒత్తిడి, కేసులు పెట్టారు. కావాలని వర్ధన్నపేట నియోజకవర్గాని ఎస్సీ రిజర్వ్ చేశారు. ఓటు నోటుకు కేసు..నాకు ఎటువంటి సంబంధం లేదు. వార్త డైవర్ట్ అవుతోంది ఓటుకు నోటు కేసు పై నేను స్పదించను.

# బిజెపికి రామునిపై పట్టా.. ఏం లేదు

**- ఎమ్మెల్యే పద్మారావు**



హైదరాబాద్, (వెలుతురు): పార్టీకి ఉద్యమాలు పోరాటాలు కొత్తకాదు, ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ విధానాల పైన పోరాడుతాం. పార్టీ శ్రేణులను పార్టీని కాపాడుకుంటూ ముందుకు పోతా. కార్యకర్తలకు ఏ కష్టం కలిగిన నగరంలోని ప్రతి ఒక్క నాయకుడు అందుబాటులో ఉంటాడు. లక్షలాదిమంది పార్టీ కార్యకర్తలు నాయకుల కృషి, శ్రమ, త్యాగం వల్లనే ఈరోజు భారత రాష్ట్ర సమితి ఈ పరిస్థితిలో ఉంది.

అనేక ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ, 10 సంవత్సరాల పాటు హైదరాబాదు నగరాన్ని తెలంగాణను అద్భు తంగా అభివృద్ధి చేసింది. అవసరమైతే రానున్న ఐదు సంవత్సరాలపాటు ప్రతిపక్షంగా ఉండి ప్రజల తరపున పోరాడుతాం. కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గం చేసింది ఏం లేదు.. ఒక్క రూపాయి కూడా హైదరాబాద్ నగరానికి అదనంగా తీసుకురాలేదు. ఎవరి మతాలకు వాళ్లు పూజలు చేసుకుంటారు. పండుగలు నిర్వహించుకుంటారు. కానీ బిజెపికి రాముని పై పట్టా లేదు. మేమందరం కూడా హిందువులమే. కేవలం బిజెపి మాత్రమే హిందువుల అన్నట్లు చెప్పుకుంటుంది. కెసిఆర్ చెప్తే సికింద్రాబాద్ లోనే కాదు ఢిల్లీలో వెళ్లి కూడా కొట్లాడే దమ్ము మాకుంది.మాకు కెసిఆర్ పైన అంత నమ్మకం ఉంది. ఇంత పెద్ద తెలంగాణ ఉద్యమాన్ని నడిపి విజయం సాధించిన మాకు, ఈ పార్లమెంటు ఎన్నికలు ఒక లెక్క కాదు. ఈ ఎన్నికలలో బలంగా గెలుస్తాం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నాం. ఈ ఎన్నికల్లో బిసిలకు పార్టీ అధికంగా అవకాశం ఇచ్చింది.

## కాంగ్రెస్ పాలనలో

# కష్టాలు మొదలు

**- తలసాని శ్రీనివాస్ యాదవ్**

హైదరాబాద్, మార్చ్ 25,(వెలుతురు): కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఆదర్శవంతమైన పాలన అందించిన తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజులలో విద్యుత్, నీటి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిందని విమర్శించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కార్యకర్తలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, పార్లమెంట్ ఎన్నికలలో సమిష్టిగా పని చేసి సికింద్రాబాద్ నియోజకవర్గ అభ్యర్థి పద్మారావు గౌడ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల తోనే ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా త్రాగునీటిని సరఫరా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు పంపుతుందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను వంద రోజులలో అమలు చేస్తామని చేయలేదని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రజల పక్షాన ప్రభుత్వం పై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడతామని హెచ్చరించారు.






## హరీష్.. ప్రాజెక్టులపై

# చర్చకు సిద్ధమా?

- రైతు సమస్యలు, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్చించడానికి సిద్ధమా అంటూ హరీష్ రావుకు సవాల్ విసిరిన జూపల్లి
- సమయం, తేదీ, వేదిక ఏదో చెప్పాలని డిమాండ్
- హరీష్ రావుకు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్

హైదరాబాద్, మార్చ్ 25,(వెలుతురు): అసలు సినిమా ముందుంది. బీఆర్ఎస్ హాయంలో జరిగిన అవినీతిని బయటపెడతాం. మీ తప్పులన్నీ బయట పెట్టాక తలకాయ ఎక్కడ పెట్టుకుంటారు. హరీష్ రావు సచివాలయాన్ని ముట్టడిస్తామని అంటున్నారు. గత పదేళ్లలో రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు.

ఇప్పుడు చేసేదేం లేక సచివాలయం ముట్టడిస్తామని అంటు న్నారు. రాయలసీమకు నీళ్ళు తరలించుకుపోతుంటే గుడ్లు అప్పగించి చూసారు. కొత్త ప్రాజెక్ట్ లను పూర్తి చేయలేదు... పాత ప్రాజెక్ట్ ల నిర్వహణను గాలికి వదిలేసారు. పది సంవత్సరాల్లో ఎప్పుడైనా పంట నష్టానికి పరిహారం ఇచ్చారా? ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమాను అమలు చేశారా ? పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే హరీష్ రావు అబద్ధాలు మాట్లాడుతున్నారు.

మీ అనాలోచిత నిర్ణయాల వల్లే తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. అసలు బీఆర్ఎస్ నాయకులకు రైతుల గురించి, వ్యవసాయం గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా? గతంలో వరి వేస్తే ఉరి అన్నది మీరు కాదా? రైతులకు వరి వేయద్దని చెప్పి.... ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో వరి వేసింది ఎవరు?

అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. పంట నష్టంపై సీయం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. పంట నష్టంపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. నివేదిక రాగానే రైతులకు ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లిస్తాం.


వచ్చే వాన కాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేస్తాం. అన్నదాతల కష్టాలు, కడగండ్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమే. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగలేదు. గత పదేండ్లలో 6, 651 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.మేడి గడ్డ ప్రాజెక్ట్ కుంగుబాటు మీ పాపం కదా? వర్షం కాలం సీజన్‌లో అధికారంలో ఉంది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? మరి ప్రాజెక్ట్ ల్లో నీళ్లు ఎందుకు నింపలేకపోయారు. ప్రతీ నీటిని బొట్టును ఒడిసి పడితామని చెప్పి... సకాలంలో ప్రాజెక్ట్ లను పూర్తి చేయ లేదు. కట్టిన ప్రాజెక్ట్‌లు కూడా కూలీపోయే పరిస్థితులు ఉన్నాయి. పాల మూర్ – రంగారెడ్డి ప్రాజెక్ట్ ను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆదరబాదరగా పాలమూర్ – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కానీ ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వలేక పోయారు. పాలమూర్ – రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే ఇవాళ దక్షిణ తెలంగాణ ఎడారిగా మారి ఉండేది కాదు. నీటిపారుదల ప్రాజెక్ట్ లే కాదు ఏ ఒక్క హామీని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి... చిప్ప చేతికి ఇచ్చి వెళ్ళిపోయారు. అయినా సీయం రేవంత్ రెడ్డి సారద్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పుతారు. ఉమ్మడి పాలమూర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, శంకర్, వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆలీబాబా నలభై దొంగలు.. కాదు కాదు

# ఆలీబాబా నకిలీ విలేఖరులు

- ఎల్బీనగర్ నియోజకవర్గంలో నకిలీ రిపోర్టర్ల బాగోతం
- ఎస్ఓటి, టాస్క్ ఫోర్స్ పోలీసులు స్పందించాలంటూ బాధితుల విజ్ఞప్తి
- ఎవరికీ అనుమానం రాకుండా అటు పోలీసులతో..ఇటు రాజకీయ నాయకులతో దోస్తానా
- నేరం బయటపడకుండా వారితో ఫోటోలకు ఫోజులిచ్చి వీరి నేరాలను కప్పిపుచ్చు కుంటున్నారు ఈ బడుద్ధాయిలు ..
- ప్రతిరోజు అన్నం కంటే ఎక్కువే తింటారు పైసల్..
- ఎట్లా సంపాదించాం అన్నది ముఖ్యం కాదు..ఎంత సంపాదించాం అన్నది వీరి లక్ష్యం.
- వీరికి విలువలు,పలువలు అసలే ఉండవు..పరువు, ప్రతిష్టలు,లజ్జ, సిగ్గు అసలే ఉండదు.
- జర్నలిస్టులమని చెప్పుకుంటూ పరువు తీస్తున్నారు.

హైదరాబాద్, (వెలుతురు): కష్టపడకుండా కాసులు వసూలు చేయడం ఈ గ్యాంగ్ హాబీ పట్టుకోవాల్సిన పోలీసులు వీరే ఒరిజినల్ అనుకొని నమ్మి దోస్తానంతో వీరితో ఫోటోలు దిగుతున్నారు.వీళ్ల నిజ స్వరూపం తెలిస్తే " పునుపు " పాపక ఊరుకోరు మరి.వసూళ్ల దందా.. అక్రిడేషన్ల దందా.. ఐడి కార్డుల దందా.. బ్లాక్ మెయిల్ దందా.. వగైరా.. వగైరా.. అన్ని వీరి నిత్య కృత్యాలు.వార్తలు రాసే దమ్ము లేని సవట దద్దమ్మలు,దౌర్భాగ్యులు ఈ దందాలో మాత్రం బహు నిష్ణాతులు. ఒకడికి ఇంట్లో నాలుగు నుండి ఐదు అక్రిడేషన్, అలాగే ఐడి కార్డులు భార్య బిడ్డలు కొడుకులు మరియు బంధువులు అన్ని వసూలు చేసే డబ్బులతో కొనుక్కున్నవే, ఇందులో కొన్ని




వారి దాష్టిక నైపుణ్యం ప్రదర్శించి తయారు చేసిన ఫేక్ కార్డ్స్ ఇది పోలీసులు పరిశీలిస్తే బయటపడుతుంది. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతూ పవిత్రమైన పాత్రికేయ వృత్తి పరువు తీసే కార్యం ఎల్ల పెడుతున్నారు.

ఈ నకిలీలునాలుగు గ్రూపులుగా తయారై రాష్ట్ర నలుమూలల చిన్నా పెద్ద వ్యాపారులను, రాజకీయ నాయకులను, అధికారులను,చివరికి సామాన్యుని సైతం వదలకుండా బురిడీ కొట్టించి మేమే ఒర్జినల్ రిపోర్టర్లమంటూ చెప్పుకుని అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ జర్నలిస్టు వృత్తిని అప్రతిష్ఠ పాలు చేస్తున్నారు ఈ లంగా.. ఉచ్చా..లపంగా..బద్మాష్..కేటు గాండ్లు (నకిలీ రిపోర్టర్స్). వీరి పని పట్టవలసిన సమయం ఆసన్నమైంది.

ఒక్క ఎల్బీనగర్ అడ్డాగానే కాకుండా హైదరాబాద్ మహానగరం లో ఇలాంటి నఖిలి విలేకరుల ఆగడాలు దినదినం మితిమీరి పోయాయని గుసగుసలు గుప్పుమంటున్నాయి. ఇటీవల పత్రికల్లో చూస్తున్నాం నిజమైన పాత్రికేయులు పరువు కోసం ప్రాకులాడుతుంటే ఈ లుచ్చా గాళ్లు మనోవేదనకు గురి చేస్తున్నారని నికార్సైన వర్కింగ్ జర్నలిస్టులందరూ లబోదిబోమని నెత్తి, నోరు కొట్టుకుంటున్నారు.


ఇలాంటి వారి పట్ల అటు పోలీసులు, ఇటు సమాచార శాఖ, ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచాలని, ప్రజలు కోరుతున్నారు.


## తప్పుడు వార్తలు ప్రసారం చేసిన

# 16 మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు

**ఒక్కో మీడియా సంస్థపైన రూ. 10 కోట్ల దావా వేసిన రాజేంద్ర ప్రసాద్ పాకాల**

హైదరాబాద్, మార్చ్ 25,(వెలుతురు): రాడిసన్ బ్లూ హొటల్‌లో జరిగిన డ్రగ్స్ కేసులో తప్పుడు వార్తలు ప్రసారం చేసిన 16 మీడియా సంస్థలకు రాజేంద్ర ప్రసాద్ పాకాల లీగల్ నోటీసులు పంపారు. ఒక్కో మీడియా సంస్థపైన రూ. 10 కోట్ల దావా.. మొత్తంగా రూ. 160 కోట్లకు దావా వేశారు పాకాల. రాడిసన్ బ్లూ హొటల్లో జరిగిన డ్రగ్స్ దందాలో సూత్రధారి రాజేంద్రప్రసాద్ పాకాల అని పలు మీడియా సంస్థల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో తన మీద అనవసర వార్తలు రాశారని మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపారు.అసత్య కథనాలతో తన పరువుకు భంగం కలిగించారని పాకాల రాజేంద్రప్రసాద్ నోటీసుల్లో తెలిపారు. ఒక్కో మీడియా సంస్థపై రూ.10 కోట్ల దావా చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. తప్పుడు కథనాలను వారంలోగా ఆన్‌లైన్‌లో నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆయా మీడియాసంస్థలతోపాటు గూగుల్ ఇండియా, యూట్యూబ్ సంస్థలకు రాజేంద్రప్రసాద్ నోటీసులు పంపారు. ఉద్దేశపూర్వకంగా తన పరువు నష్టం కలిగించారని, తాను అనుభవించిన మానసిక





వేదనకు పరిహారం చెల్లించాలని నోటీసుల్లో డిమాండ్ చేశారు. తనకు ఆయా సంస్థలు క్షమాపణ కూడా చెప్పాలని కోరారు.

1. తెలుగు సమయం,2. హిట్‌వీ తెలుగు,3. తుపాకీ మీడియా ప్రయివేట్ లిమిటెడ్,4. హైదరాబాద్ మీడియా హౌజ్ ప్రయివేట్ లిమిటెడ్,5. హ్యాష్‌ట్యాగ్ యు,6. ఏషియన్ ఎక్స్‌టీ డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్,7. ఏషియానెట్ న్యూస్ తెలుగు


8. ఆంధ్రా విషెష్,9. స్లాష్ మీడియా అండ్ టెక్నాలజీస్,10. యోయో మీడియా ప్రయివేట్ లిమిటెడ్,11. ఒకే టీవీ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రయివేట్ లిమిటెడ్,12. ప్రవాస మీడియా ఎల్ఎల్‌పీ,13. వైల్డ్ వూల్ఫ్ న్యూస్,14. దాసరి శ్రీనివాస్(కాళోజీ టీవీ),15. యూట్యూబ్ ఇన్,16. గూగుల్ ఎల్ఎల్‌సీ – ఇండియా లెయిజన్ ఆఫీసర్

# తెలంగాణ భవన్ వేదికగా బయటపడిన బీఆర్ఎస్ నేతల మధ్య విబేధాలు

**'నిన్ను ఎవడ్రా పిలిచింది' ...మాగంటి గోపి**

**తనకు చెప్పడానికి నువ్వేవడివి.. రావుల శ్రీధర్ రెడ్డి**

హైదరాబాద్, మార్చ్ 25,(వెలుతురు): తెలంగాణ భవన్ వేదికగా బయటపడిన బీఆర్ఎస్ నేతల మధ్య విబేధాలు వెలుగు చూశాయి. సికింద్రబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి మధ్య గొడవ జరిగింది. మాగంటి గోపీనాథ్ మాట్లాడుతుండగా శ్రీధర్ రెడ్డి అడ్డుకున్నారు. శ్రీధర్ రెడ్డి పై మాగంటి ఆగ్రహం



వ్యక్తం చేశారు. 'నిన్ను ఎవడ్రా పిలిచింది' అంటూ మాగంటి గోపి ఫైర్ అయ్యారు. నువ్వేవడివి.. తనకు చెప్పడానికి అంటూ రావుల శ్రీధర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే తలసాని సర్ది చెప్పారు.

పార్టీ ఓటమి పాలైంది మొదలు.. నేతల మధ్య విభేదాలు రోజుకొకటి వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంపై చేపట్టిన సమీక్ష కూడా రచ్చకు దారి తీసింది. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టడంపై ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. వేదిక మీద నుంచి దిగిపోవాలని పట్టుబట్టింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆ తర్వాత పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడే సమయంలో రోహిత్ వర్గం నినాదాలు చేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే అంతలోనే లంచ్ బ్రేక్ ప్రకటించడంతో వివాదం మరింత ముదరకుండా ఆగిపోయింది.


శ్రీరస్తు
శుభమస్తు
అవిఘ్నమస్తు
ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప
గణపతి
సుబ్రమణ్యస్వామి
ఓం శ్రీ సత్యనారాయణ స్వామి నమ:
నమో పార్వతి పతయే నమ:
శ్లో॥ ఓంకార మంత్ర సంయుక్తం, నిత్యం ధ్యాయంతి యోగిన: కామదం మోక్షదం తస్మై ఓంకారాయ నమో నమ: ॥
శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో
గణపతి, సుబ్రమణ్యస్వామి , పార్వతి పరమేశ్వరులు,సత్యనారాయణ స్వామి , అభయాంజనేయ స్వామి , నవగ్రహాలు
విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక
అభయ ఆంజనేయ
నవగ్రహాలు
స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉత్తరాయన
ఫాల్గుణ మాస బహుళ సప్తమి
తేది 01-04-2024 నుండి 04-04-2024 వరకు
కార్యక్రమములు
01.04.2024 సా॥ 4.30 ని॥లకు గణపతి పూజ, విగ్రహాముల ఊరేగింపు.
02.04.2024 ఉ ॥ 8.00 గం॥లకు గణపతి పూజ , పుణ్యాహవాచనం, రక్షా బంధన అఖండ దీపారాధన, ఋత్విక్ వరణ
అంకురారోపణ, యాగశాల ప్రవేశం, యోగిని వాస్తూ క్షేత్రపాలక నవగ్రహా సర్వతో భద్ర మండప అవాహన
షోడశ ఉపచార పూజలు జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ, అనంతరం అన్న ప్రసాదాన వితరణ.
సా ॥ 5. 00 గం ॥ లకు మండప పూజలు , ప్రతిష్ఠ , విగ్రహాలకు క్షీరాధివాసం, ఆవాహిత దేవత హోమాలు.
రాత్రి 08.00 గం ॥ లకు తీర్థ ప్రసాదాల వితరణ.
03.04.2024 ఉ ॥ 8.00 గం॥లకు అవాహిత దేవతా మండప పూజలు, మూలమంత్ర హోమాలు , ధాన్యాధివాసం.
మం ॥ 12.30 ని॥ లకు అన్న ప్రసాదాల కార్యక్రమం. సా ॥ 5. 00 గం ॥ లకు మండప పూజలు , ఆవాహిత దేవత
హోమము, ప్రతిష్ఠ మూర్తులకు ఫల, పుష్ప, శయ్యాధివాసం, చతుర్వేద స్వస్తి.
రాత్రి 08.00 గం ॥ లకు తీర్థ ప్రసాదాల వితరణ.
04.04.2024 ఉ ॥ 6.00 గం॥లకు ప్రాత: కాల పూజలు , ఉ ॥ 7.47 ని ॥లకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహా ప్రతిష్ఠ, అనంతరం పూర్ణాహుతి,
బలిహరణ కుంభ నివేదన , విగ్రహాలకు నెత్రోన్మీమిళనం, అనంతరం ,
పార్వతి పరమేశ్వర, రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల శాంతి కళ్యాణం, బ్రహ్మణ ఆశీర్వచనము.
బ్రహ్మ శ్రీ వేద మూర్తులు లోక శ్రీకాంత్ శర్మ గారి ఆధ్వర్యంలో జరుపబడును.
ముఖ్యగమనిక :
విరాళాలు సమర్పించు భక్తులు
దేవాలయం వద్ద
సంప్రదించవలసినదిగా కోరుచున్నాము.
లోకా: సమస్తా సుఖినో భవన్తు
ఆహ్వానించువారు.
శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం
తుర్కయాంజాల్ 'X' రోడ్.



వంటచేయడం రాదనే బెంగ అవసరం లేదుబంధువులొచ్చినా భయం వద్దుపిల్లలకు రోజూ వెరైటీ వంటకాల విందుఆన్ లైన్ లో వెలిసిన కిచెన్లుఫుడ్ బిజినెస్‌లో దూసుకుపోతున్న మహిళలు మనకు ఎన్నో పండుగలున్నాయి. పండుగల రోజు మనం ఏం చేస్తాం ? కేవలం పూజలు, వ్రతాలతోనే సరిపెడ తామా? పండుగలనేవి.. రకరకాల పిండివంటలు, రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసుకుని కడుపారా ఆరగించి ఆనందించే సందర్భాలు. ఆ రోజుల్లో పేద, ధనిక తేడాలేకుండా అందరి ఇంటి వంటగదులూ హడావుడిగా ఉంటాయి. గిన్నెలు, గరిటెల శబ్దాలు వినసొంపుగా చెవులను చేరుతుంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం... వెంటనే లాగిన్ అవ్వండి... నోరూరించే వంటలను చూసి నేర్చుకోండి.



# విభిన్న రుచుల లోగిళ్లు...
# ఆన్‌లైన్ వంటిళ్లు

ఇలాంటి సందర్భాల్లో కొత్తగా ఏం వంటలు చేయవచ్చు? కుటుంబ సభ్యులకు కొత్త రుచులను ఏ రకంగా అందించాలి? ఇవి సాధారణంగా ప్రతి మహిళకీ, ప్రతి గృహిణికీ ఎదురయ్యే సందేహాలు. అయితే మీ కోసమే ఈ ఆర్టికల్. చదవండి. ఆన్‌లైన్ వంట ఇళ్లలో లాగిన్ అవ్వండి. పెద్ద పెద్ద చదువులు చదివి కూడా ఆన్ లైన్ కిచెన్‌ని ప్రారంభించి, వంటలు, చెఫ్‌ల సమాచారాన్ని సృజనాత్మకంగా అందించి, తమ ప్రొడక్ట్‌కి బ్రాండ్ వేల్యూ పెంచుకుంటున్నారు. పాతకాలం అమ్మమ్మలు, బామ్మల కాలం నాటి పిండివంటల నుంచి నేటి తరం ఆధునిక యువత ఇష్టపడే ఫాస్ట్ ఫుడ్ వరకూ అన్ని రకాల సమాచారం ఒక్క క్లిక్‌లో లభ్యం.

**అర్చనాస్ కిచెన్:**

అర్చన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యోగా టీచర్. కొద్ది కాలానికి వివాహం, తల్లిగా కొత్త బాధ్యతలు. అంతటితో



ఆగలేదు. మరో కొత్త విభిన్న పాత్రకు సిద్ధమయ్యారు అర్చన. అలా మొదలైంది... అర్చనాస్ కిచెన్. ఆధునిక జీవనశైలి మన ఆరోగ్యంపై ఎంతో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోందనేది కాదనలేని సత్యం. దీనిలో ముఖ్యమైనది ఫాస్ట్ ఫుడ్స్. అందుకే అర్చన దీనిపైనే దృష్టిపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫాస్ట్ ఫుడ్స్ రెసిపీలకి పోషక విలువలను జోడించి తన వెబ్ సైట్లో పోస్ట్ చేయసాగారు. అంతే కాదు... వివిధ సందర్భాలకు తగిన రెసిపీలు, సీజనల్ వంటలు... మరెన్నో రకాలు అర్చనాస్ కిచెన్ లో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.



**సుబ్బూస్ కిచెన్:**

దక్షిణ భారత వంటల ప్రత్యేకం "సుబ్బూస్ కిచెన్". దక్షిణ భారత ఆహార పదార్థాలకు ఎంతో పురాతన ప్రాశస్త్యం ఉన్నవి. ఆ సంప్రదాయ వంటకాలను తన సైట్ లో ఉంచారు సుబ్బు. "ఇవన్నీ నేను మా అమ్మ నుంచి నేర్చుకున్నా" అని గర్వంగా చెబుతారు ఆమె. చాలామందికి వంట చేయడం అంటే ఇష్టం ఉండదు. అలాంటివారికి దానిపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ బ్లాగ్ ప్రారంభించారు. వంట అంటే బ్రహ్మవిద్యేమీ కాదు... ఇష్టంతో చేస్తే ఎంతో ఆనందంగా, సులభంగా నచ్చిన వంటకాన్ని వండివార్చేయొచ్చు. దానికి కావలసినదంతా సుబ్బూస్ కిచెన్ లో చూడవచ్చు.

**మంజులాస్ కిచెన్:**

జైనుల సిద్ధాంతం... "లివ్ అండ్ లెట్ లివ్" (బ్రతకండి, బ్రతకనివ్వండి). ఇదే మంజులాస్ కిచెన్‌ని నడిపించే మూలసూత్రం. కూరలు అందంగా కనబడేందుకు ఫ్లేవర్లను కలిపే బదులు... రుచి పెంచేందుకు కొద్ది మొత్తంలో మసాలా దినుసులు, సుగంధ దినుసులు కలపడం ఉత్తమం. పైగా ఇది పురాతన కాలం నుంచీ వస్తున్న అలవాటు. ఈ రకంగా సహజసిద్ధమైన పద్ధతుల్లో తయారయ్యే పదార్థాల వివరాలెన్నో మనం ఈ సైట్ ని బ్రౌజ్ చేస్తుంటే తెలుసుకోవచ్చు. ఇక్కడున్న వీడియోలు, ట్యుటోరియల్స్ చూసి ఎవరైనా... చాలా సులభంగా రుచికరమైన పదార్థాలు తయారుచేయవచ్చు.

**బేకర్ ఇన్ డిస్గైజ్:**

బేకింగ్... ఇదొక ఆర్ట్. మన చుట్టూ ఎన్నో బేకరీలు ఉంటాయి... కానీ అన్నింట్లో ఐటమ్స్ రుచిగా ఉండవు కదా. అందుకే బేకింగ్ ఈజ్ యాన్ ఆర్ట్. ఆ ఆర్ట్‌లో ప్రత్యేకత సాధించింది శర్వాణి. ఏ పదార్థాన్ని ఎంత పాళ్లలో కలపాలి, ఏ టెంపరేచర్ వద్ద ఎంతసేపు ఒవెన్‌లో ఉంచాలి... ఇవన్నీ ఒకరు చెబితే వచ్చేవి కాదు అంటారు శర్వాణి. చేస్తున్న పనిపై ఆసక్తి, అభిరుచి ఉన్నప్పుడే ఫలితం కూడా గొప్పగా ఉంటుందనేది ఆమె నమ్మకం. ఈ నమ్మకమే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. బేకర్ ఇన్ డిస్గైజ్‌లో మీరు శర్వాణి సొంత రెసిపీలతో పాటు మరెన్నో రెసిపీల గురించి తెలుసుకోవచ్చు.

**శైలూస్ ఫుడ్:**

ఫుడ్ బ్లాగుల్లో ప్రముఖమైన వాటిలో శైలూస్ ఫుడ్ ఒకటి. ఇలా ఎందుకంటున్నామో తెలియాలంటే ఓసారి మీ కంప్యూటర్లో "శైలూస్ ఫుడ్" ఓపెన్ చేయండి. కంప్యూటర్ స్క్రీన్ పై ఫొటోలు చూస్తుంటేనే మనకు నోరూరుతుంది. అంత అందంగా ఉంటాయి శైలూస్ కిచెన్ లో సిద్ధమైన ఆహారపదార్థాలు. ఈ బ్లాగ్ లో భారత్ లోని అన్ని ప్రాంతాల ఫుడ్ ఐటమ్స్ వివరాలు ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రా రెసిపీలకు ఇది ప్రత్యేకమని చెప్పుకోవచ్చు.

**షో మి ద కర్రీ:**

వంట ఎలా చేయాలి అనేది తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వంట ఎలా చేయకూడదు అనేది తెలుసుకోవడం అంతకన్నా ముఖ్యం. హేతల్, అనూజ... వీరిద్దరూ తమ పిల్లలకి, కుటుంబానికి చాలా సంవత్సరాలు ఆహారం వండిపెట్టారు. ఎవరికైనా సర్వసాధారణం... అప్పుడప్పుడూ రుచి కొద్దిగా అటూఇటూ అవ్వడం. దీనికి వీరిద్దరూ అతీతులేమీ కాదు. అలా వారి కుటుంబం, పిల్లలూ నిత్యం ఇస్తున్న ఫీడ్ బ్యాక్ వారిలో ఓ కొత్త ఆలోచన రేకెత్తించింది. ఎందుకు ఓ వెబ్ సైట్ ప్రారంభించకూడదు అని. అంతే... దక్షిణ భారత వంటల రెసిపీలతో సైట్ సిద్ధం చేశారు. ఇందులో కేవలం వారి రెసిపీలే కాదు... వంట చేస్తున్న సమయంలో మీ అనుభవాలు, అభిప్రాయాలు ఇతరులతో పంచుకోవచ్చు. అలాగే మీ కొత్త వంటలు, ఫెయిలైన రెసిపీలు... తద్వారా కలిగిన అనుభవాలను సరదాగా వీడియోలు, పాడ్ కాస్ట్‌ల రూపంలో పోస్ట్ చేయవచ్చు.

**మై డైవర్సిటీ కిచెన్:**

ఇది కేవలం ఓ రెసిపీ బ్లాగ్ మాత్రమే కాదు... అపర్ణ జీవితం. అపర్ణకి ఓ ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. అదేమిటంటే... రకరకాల ఆహార పదార్థాలను తయారుచేసి, వాటిని తన సొంత కెమెరాతో ఫొటోలు తీసుకుని చూసి మురిసిపోయేది. ఆ ఆసక్తే ఈరోజు "మై డైవర్సిటీ కిచెన్"లో విస్తృత ఫొటో లైబ్రరీ ఏర్పాటుని సులభం చేసింది. ఈ బ్లాగ్‌కి ఉన్న మరో ప్రత్యేకత... ఇందులో ఉన్నవన్నీ వెజిటేరియన్ రెసిపీలు మాత్రమే. బియ్యం, కూరలు, పప్పులు, కొబ్బరి... ఇలా సాధారణంగా ఇంట్లో లభించేవాటితోనే విభిన్న రుచులను సిద్ధం చేసే మెళకువలు ఎన్నో ఈ బ్లాగ్ లో లభ్యమవుతాయి. కేవలం భోజన సంబంధ పదార్థాలే కాదు... వెనిలా వంటి వివిధ ఫ్లేవర్ల ఐస్ క్రీమ్, చాక్లెట్ తయారీ వంటివి కూడా "మై డైవర్సిటీ కిచెన్" మనకు నేర్పిస్తుంది.

**ఎడిబుల్ గార్డెన్:**

నాగ్స్... ఈమె కేరళ, హైదరాబాద్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరాల్లో వివిధ ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ... పెళ్లి, భర్త, పిల్లలు... ఇవే జీవితంగా గడిపేవారు. అయితే ఇది ఆమెకు సంతృప్తి నివ్వలేదు. ఇంకా ఏదో ప్రత్యేకంగా చేయాలని నిరంతరం తపనపడేవారు. ఆ తపన నుంచి పుట్టినదే "ఎడిబుల్ గార్డెన్". ఆన్ లైన్ లో విహరించే మహిళల్లో ఈ బ్లాగ్ పేరు తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! తన కేరళ, తమిళనాడు వంటకాలకు, విదేశీ రెసిపీలను జతచేసి అందించడమే ఈ గార్డెన్ ప్రత్యేకత. కొత్త కొత్త వంటకాలను ఎలా తయారుచేయాలనేదానిపైనే నాగ్స్ దృష్టి. అందుకే ఈ బ్లాక్ మిగిలిన వాటికంటే భిన్నంగా ఉంటుంది.

**నిషా మధులిక:**

నిషా వివరించే వంటకాలను మనం కూడా చాలా సులభంగా మన ఇళ్లలో తయారుచేసుకోవచ్చు. భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధిచెందిన వంటలను అందించడమే ఈ వెబ్ సైట్ ప్రత్యేకత. మొదట్లో కేవలం రెసిపీలకు సంబంధించిన ఆర్టికల్స్ మాత్రమే ఈ సైట్ లో ఉండేవి. క్రమంగా వీడియో ట్యుటోరియల్స్ కూడా పోస్ట్ చేయసాగారు. ఈ వీడియోలు, రెసిపీలు అన్నీ హిందీభాషలో ఉండటం ఈ సైట్ ప్రాచుర్యానికి మరింత దోహదపడింది.



## 100 వంటలు చేస్తుంది!

బెంగళూరుకి చెందిన మెకానికల్ చెఫ్ ఘుమఘుమలాడే భారతీయ వంటకాలు చేస్తుంది. సుమారుగా 100 వంటలను అవలీలగా చేసి పెడుతుంది. ఇందులో ఉండే సూచనలను పాటిస్తూ రుచికరమైన వంటకాలను మనకు రుచి చూపిస్తుంది.

వంట వండాలంటే పెద్ద ప్రహసనమే చేయాలి. కొన్నిసార్లు ఉప్పు, కారాలు ఎక్కువైతే.. కొన్నిసార్లు ఏ రుచిపచి ఉండవు. అన్నీ కుదిరినప్పుడు మాత్రం అవురావురుమంటూ లాగించేస్తాం. అలా రోజూ లొట్టలేసుకుంటూ తినడానికి



ఓ రోబో వంట చేయబోతున్నది. మనకు కావాల్సిన వంటకాలకు సంబంధించిన పదార్థాలను ఈ రోబో పైన ఉండే బాక్సుల్లో నింపాల్సి ఉంటుంది. అది వంటకాలకు కావాల్సినంత మోతాదులో తీసుకొని వంట పూర్తి చేస్తుంది. ముందుగా మనకు కావాల్సిన వంటకమేదో దీనికి అనుసంధానమై ఉన్న కంప్యూటర్ సహాయంతో దానికి అసైన్ చేయాలి. దీన్ని బెంగళూరుకి చెందిన సోహన్ సుజే కార్లోస్, అర్పిత్ శర్మ అనే ఇద్దరు తయారుచేశారు. ఇందులో సోహన్ మెషీన్ లెర్నింగ్ రీసెర్చర్, అర్పిత్ ఎయిరోస్పేస్ ఇంజనీర్. వీళ్లిద్దరూ కలిసి ఎంతో శ్రమపడి దీన్ని తయారు చేశారు.

అయితే ఇంకా గ్రైండింగ్, ప్రెషర్ కుక్కింగ్‌లాంటివి ఈ రోబోకు పెద్దగా చేయడం రాదు. ఇప్పటిదాకా ఉప్మా, చోలే మసాలా, మటర్ పన్నీర్, దాల్ తడ్ఖా.. ఇలాంటి వందకు పైగా వంటకాలను ఇది చేయగలదు. వంటరాని అమ్మాయిలకు, బ్రహ్మచారులకు ఇదో పెద్ద వరమే అని చెప్పొచ్చు. ఇది ఇంకా ప్రయోగదశలోనే ఉంది. అతి త్వరలోనే దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు.

## పెండలంతో వంటలు


దుంప జాతికి చెందిన పెండలం వాడకం ఆహార పదార్థాల్లో తక్కువే. విలువైన పోషకాలున్న ఈ దుంపలతో చేసే విభిన్నమైన వంటలు మంచి రుచినే కాదు, శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తాయి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, పొటాషియం, పీచు వంటి పోషకాలు వీటిలో సమృద్ధిగా లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఒమెగా 3 ఫ్యాటీయాసిడ్లు అధికంగా ఉంటాయి. మహిళల్లో ఈజెన్ స్థాయిల్ని పెంచేందుకు దోహదపడతాయి. పెండలం ఆకులను నీటిలో మరగబెట్టి తాగితే విరేచనాలు, తలనొప్పి, తిమ్మిర్లు తగ్గుముఖం పడతాయి. చేదు తగ్గడానికి పెండలం ఆకుల రసంలో కాస్త తేనె వేసుకుని తాగితే శరీరం తక్షణం శక్తిని పుంజుకుంటుంది. పెండలంతో పలురకాల కూరలు, చట్నీలు, గ్రేవీలు, కెబాబ్‌లు, పులుసు, చిప్స్ వంటివి చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని 'తెల్లకంద'గా వ్యవహరిస్తారు.

**చిప్స్**



పెండలం 1 కేజీ
కారం 1/2 కప్పు
పుట్నాల పప్పు 1 కప్పు
వేరుశెనగ పప్పు 1 కప్పు
కరివేపాకు కాస్త
నూనె 250 గ్రా.
ఉప్పు 5 చెంచాలు
జీలకర్ర 2 చెంచాలు

పెండలం దుంపలపై చెక్కు తీసి ఉప్పు రాసి కాసేపు ఎండలో పెట్టాలి. నీరంతా ఇగిరిపోయాక దుంప ముక్కలను సన్నగా తరగాలి. బాణలిలో నూనె కాగాక వేరుశెనగ పప్పు, పుట్నాల పప్పు, జీలకర్ర, పెండలం ముక్కలను దోరగా వేయించాలి. చివరగా ఉప్పు, కారం కలపాలి. ఈ చిప్స్‌ను సాయంత్రం వేళ స్నాక్స్‌గా తినొచ్చు.



**పులుసు**

పెండలం ముక్కలు 5 కప్పులు
చింతపండు రసం 8 కప్పులు
కొత్తిమీర కొంచెం
నువ్వుల పొడి 1/2 కప్పు
కరివేపాకు కొంచెం
కొబ్బరి కోరు 1/2 కప్పు



బియ్యప్పిండి 1 కప్పు, మెంతులు 1 చెంచా
జీలకట్ట 1 చెంచా, ఇంగువ కాస్త
పసుపు కొంచెం, , ఎండుమిర్చి 5
పచ్చిమిర్చి 5, ఉల్లిముక్కలు 1 కప్పు
ఉప్పు 2 చెంచాలు

బాణలిలో పోపులు వేయించి, అందులో కొబ్బరి కోరు కలపాలి. చింతపండు రసాన్ని మరగించాక పోపు కలపాలి. వేరే గిన్నెలో ఉల్లి, పెండలం ముక్కలు ఉడికించి, మరగించిన చింతపండు రసంలో వేయాలి. చివరగా ఇంగువ, బియ్యప్పిండి కలిపి, పొంగు వస్తుండగా పులుసును కిందకు దింపేయాలి.

**కూర**



పెండలం ముక్కలు 2 కప్పులు
ఉప్పు 1 చెంచా
పసుపు 1/2 చెంచా
ఎండుమిర్చి 5
మినప్పప్పు, శెనగపప్పు 4 చెంచాలు
ఆవాలు, జీలకట్ట 2 చెంచాలు
పచ్చిమిర్చి 6
కరివేపాకు కొంచెం

పసుపు, ఉప్పు వేసి పెండలం ముక్కల్ని నీటిలో ఉడికించి వార్చి పెట్టాలి.

బాణలిలో పోపులు వేయించాక అందులో నలగ్గొట్టిన ఎండుమిర్చి, పచ్చిమిర్చి, పెండలం ముక్కలు, ఉప్పు కలపాలి. చివరగా నిమ్మరసం వేయాలి. ఈ కూర అన్నం, చపాతీ, పూరీల్లోకి బాగుంటుంది.

**అల్లం కూర**

అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ 1/2 కప్పు
పెండలం ముక్కలు 4 కప్పులు
నూనె 5 చెంచాలు, ఎండుమిర్చి 4
కరివేపాకు కొంచెం,
పోపులు 4 చెంచాలు
ఉప్పు 2 చెంచాలు
పసుపు 1/2 చెంచా

ముందుగా ఉప్పు, పసుపువేసి పెండలం ముక్కలను ఉడికించాలి. బాణలిలో పోపులు వేయించి, పచ్చిమిర్చి పేస్ట్ కలపాలి. ఇందులో పెండలం ముక్కలు, ఉప్పు వేస్తే రుచికరమైన కూర సిద్ధం.

# 'గేమ్ చేంజర్' ఫస్ట్ సాంగ్




ఆర్ఆర్ఆర్ వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్' రూపొందుతోన్న సంగతి తెలిసిందే. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై జీ స్టూడియోస్ అసోసియేషన్‌లో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అన్‌కాంప్రమైజ్డ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'జెంటిల్ మేన్' నుంచి 2.0 వరకు శంకర్ ఒక్కో సినిమాను ఒక్కో విజువల్ వండర్‌లా తెరకెక్కించి సౌతిండియన్ సినిమాలకు ఓ ప్రత్యేకతను తీసుకొచ్చిన డైరెక్టర్ శంకర్. ఆయన డైరెక్షన్ లో రామ్ చరణ్ సినిమా చేస్తారనగానే మెగాభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూడసాగారు.సినిమా అనౌన్స్‌మెంట్ రోజు నుంచే సినిమాపై అంచనాలు పెరుగుతూ వస్తున్నాయి. మూవీని సిల్వర్ స్క్రీన్‌పై ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆతృతతో ఎదురు చూస్తున్నారు. గొప్ప సినిమాలను అందించాలనే తపనపడి, ఎంతటి రిస్క్ అయినా చేయటానికి సిద్ధపడే ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ తోడు కావటంతో 'గేమ్ ఛేంజర్' సినిమాను అందరి అంచనాలను మించేలా రూపొందిస్తున్నారు. ప్రతీ ఫ్రేమ్‌ను అద్భుతం అని అందరూ మెచ్చుకోవాలనేలా సినిమాలు తీయటం శంకర్ అలవాటు. రామ్ చరణ్‌కి వరల్డ్ వైడ్‌గా ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని 'గేమ్ ఛేంజర్' సినిమాను తెరకెక్కిస్తున్నారు స్టార్ డైరెక్టర్. ఈ నేపథ్యంలో మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు.

ఈ సందర్భంగా మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్.తమన్ సంగీత సారథ్యం అందిస్తోన్న 'గేమ్ ఛేంజర్' సినిమా నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు 'గేమ్ ఛేంజర్' సినిమా నుంచి 'జరగండి..' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్స్‌లో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు.

# "లవ్ గురు" ట్రైలర్ విడుదల

## ఏప్రిల్ 11న థియేట్రికల్ రిలీజ్



వైవిధ్యమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తున్న హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "లవ్ గురు". ఆయన తొలిసారి రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్ లో నటిస్తున్న చిత్రమిది. "లవ్ గురు" సినిమాలో మృణాళిని రవి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాను విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ నిర్మించారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా "లవ్ గురు" సినిమాను రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 11న విడుదల చేయబోతున్నారు. ఇవాళ "లవ్ గురు" సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేశారు.

"లవ్ గురు" ట్రైలర్ ఎలా ఉందో చూస్తే.. తండ్రి పోరు పడలేక పెళ్లికి ఓకే చెప్తుంది ప్రియా అనే అమ్మాయి. ఆమెకు ఈ పెళ్లి ఇష్టం ఉండదు. పెళ్లి చూపుల టైమ్ లో కాబోయే భర్తకు కొన్ని కండీషన్స్ పెడుతుంది. అమ్మాయిని ఇష్టపడిన ఆ అబ్బాయి ఆమె చెప్పిన కండీషన్స్ అన్నింటికీ తలూపుతాడు. భార్యను వన్ సైడ్ గా లవ్ చేస్తాడు. షరతులన్నీ ఒప్పుకుంటాడు గానీ పెళ్లయ్యాక వాటిలో ఉన్న ఇబ్బందులు అర్థమవుతుంటాయి. పెళ్లయ్యాక ఎదురైన ఈ సమస్యల నుంచి హీరో ఎలా బయటపడ్డాడు. భార్యను ప్రేమించడం ఎలాగో తెలుసుకున్నాడా లేదా అనే అంశాలతో ట్రైలర్ ఫన్, ఎంటర్ టైనింగ్ గా చూపించారు. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ కు నచ్చేలా "లవ్ గురు" సినిమా ఉండబోతున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.

## యాక్టింగ్ మీద ప్యాషన్‌తో మళ్లీ టాలీవుడ్‌కు రావాలనుకుంటున్నా

**- నటి ప్రశాంతి హారతి**



పెళ్లాం ఊరెళితే, ఇంద్ర వంటి సూపర్ హిట్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంతి హారతి. వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాక కుటుంబంతో అమెరికాలో సెటిల్ అయ్యారు ప్రశాంతి హారతి. అక్కడ ఆమె ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. నటిగా తన కెరీర్ లో సుదీర్ఘ విరామం వచ్చింది. ఇప్పటికీ తనకు యాక్టింగ్ మీద ప్యాషన్ తగ్గలేదని, ఆ ప్యాషన్ తోనే మళ్లీ టాలీవుడ్ కు రావాలని అనుకుంటున్నానని ఇవాళ జరిగిన ఇంటర్వ్యూలో ప్రశాంతి హారతి చెప్పారు. మా కుటుంబం విశాఖలో ఉండేవాళ్లం. నాకు చిన్నప్పటి నుంచి ఆర్ట్స్ అంటే ఇష్టం. కూచిపూడి డ్యాన్స్ నేర్చుకున్నాను. మా ఇంట్లో సినిమాలు ఎక్కువగా చూసేవారు కాదు. సినిమాలంటే పెద్దగా ఇంట్రెస్ట్ లేని వాతావరణం ఉండేది. సినిమాలు చూసేందుకు నన్నూ పంపేవారు కాదు. కూచిపూడి డ్యాన్స్ నేర్చుకున్న తర్వాత కొన్ని ఫొటోషూట్స్ చేశాను. ఫొటోస్ చూసి కొన్ని సినిమాల్లో ఆఫర్స్ ఇస్తామంటూ సంప్రదించారు. మా కుటుంబ సభ్యులు నన్ను సినిమా ఇండస్ట్రీకి పంపేందుకు ఒప్పుకోలేదు. కొంతకాలం తర్వాత హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాం. యాక్టింగ్ పట్ల నా ఇంట్రెస్ట్ చూసి మా ఇంట్లో వాళ్లు ఎట్టకేలకు ఒప్పుకున్నారు. అలా శ్రీనివాసరెడ్డి డైరెక్ట్ చేసిన ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్ అనే సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టాను. ఆ తర్వాత మణిశర్మ గారు నిర్మించిన రూపాయి అనే చిత్రంలో నటించాను. ఇంతలో బాలాజీ టెలీ ఫిలింస్ వారి సీరియల్స్ లో నటించే అవకాశాలు వచ్చాయి. అలా ముంబై వెళ్లాను. ఆ తర్వాత ఇంద్ర సినిమా కోసం అడిగారు. ఆ చిత్రంలో నటించాను. అలా నా కెరీర్ కొనసాగింది. పెళ్లయ్యాక మా వారితో యూఎస్ వెళ్లాను. అప్పటి నుంచి వ్యక్తిగత జీవితానికే సమయం కేటాయించాను. అక్కడ ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను. మన నృత్యరూపకాలు రేపటి తరానికి కూడా అందాలనేది నా కోరిక. ఈ ఆశయంతోనే క్లాసికల్ డ్యాన్స్ మీద ఇంట్రెస్ట్ ఉన్న పిల్లలకు కూచిపూడి డ్యాన్స్ నేర్పిస్తూ వచ్చాను. అక్కడి పిల్లలకు తెలుగు తెలియదు. క్లాసికల్ డ్యాన్స్ పాటల్లోని అర్థాలను ఇంగ్లీష్ లో వివరించి చెప్పేవాళ్లం. అప్పుడు వారికి అర్థమై నేర్చుకునేవారు. మా పాప తాన్య నా దగ్గరే కూచిపూడి డ్యాన్స్ నేర్చుకుంది. మా పాప తాన్యతో తెలుగింటి సంస్కృతి పేరుతో మ్యూజిక్ వీడియో రూపొందించాం. ఈ మ్యూజిక్ వీడియోకు ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య కాన్సెప్ట్ తయారుచేసి రూపొందించారు. తెలుగింటి సంస్కృతికి మంచి రెస్పాన్స్ దక్కడం సంతోషాన్ని కలిగించింది. మా పాప తాన్యకు ఇప్పుడు 16 ఏళ్లు. తన ఏజ్ కు తగిన మంచి అవకాశం వస్తే పాప తాన్యను కూడా సినిమా ఇండస్ట్రీకి పంపేందుకు మా ఫ్యామిలీకి అభ్యంతరం లేదు. నేను యాక్టింగ్ కోర్సులు నేర్చు కోలేదు. అయితే క్లాసికల్ డ్యాన్సర్‌ను కాబట్టి నటిగా తెలియ కుండానే పరిణితి ఏర్పడింది. నవ్వడం, ఏడ్వడం వంటి భావోద్వేగాలు ఇలా చెబితే అలా చేసేసేవాళ్లం.




**- హీరో పృథ్వీరాజ్ సుకుమారన్**

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమాను తెలుగు స్టేట్స్ లో రిలీజ్ చేస్తోంది. ఈ సినిమాతో 16 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేశారు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్. ఈ సినిమా కోసం ఎంతో శ్రమించారు. "ది గోట్ లైఫ్" ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా ఈ సినిమాలో పనిచేసిన అనుభవాలను, తన కెరీర్ విశేషాలను లేటెస్ట్ ఇంటర్వ్యూలో షేర్ చేశారు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ వాస్తవ కథతో "ది గోట్ లైఫ్" సినిమాను తెరకెక్కించారు దర్శకుడు బ్లెస్సీ. 90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే వ్యక్తి జీవిత కథ ఈ సినిమాకు ఆధారం. రచయిత బెన్యామిన్ నజీబ్ జీవితానికి అక్షర రూపమిచ్చారు. నజీబ్ ఎడారిలో సాగించిన ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ గోట్ డేస్ అనే పుస్తకాన్ని బెన్యామిన్ రాశారు. కేరళలో అనూహ్య పాఠక ఆదరణ పొందిన ఈ పుస్తకం రైట్స్ కోసం మలయాళం సినీ పరిశ్రమలో ప్రతి స్టార్ హీరో, దర్శక నిర్మాతలు పోటీ పడ్డారు. ఆ హక్కులను మా డైరెక్టర్ బ్లెస్సీ దక్కించుకున్నారు. అప్పుడు ఈ ప్రాజెక్ట్ తో 2008లో బ్లెస్సీ నన్ను సంప్రదించారు. అలా "ది గోట్ లైఫ్" తో నా జర్నీ మొదలైంది. 2018లో "ది గోట్ లైఫ్" సినిమా షూటింగ్ మొదలుపెట్టాం. ముందుగా రాజస్థాన్ ఎడారిలో షూటింగ్ చేయాలని అనుకున్నా..అక్కడ అరబ్ దేశాల ఎడారుల వాతావరణం కనిపించలేదు. దాంతో జోర్డాన్ వెళ్లి చిత్రీకరణ జరిపాం. నేను బరువు తగ్గేందుకు ఒక షెడ్యూల్ షూటింగ్ తర్వాత 7 నెలల గ్యాప్ తీసుకున్నాం. షూటింగ్ ప్రాసెస్ లో ఉండగానే లాక్ డౌన్ వచ్చింది. అప్పుడు జోర్డాన్ షూటింగ్ లో ఉన్నాం. ప్రయాణాలు మొత్తం ఆపేశారు. అక్కడి నుంచి బయటపడే వీలు లేదు. వందేభారత్ ఫ్లైట్ తో కేరళ చేరుకున్నాం. ఏడాదిన్నర తర్వాత అల్జీరియా సహారా ఎడారిలో చిత్రీకరణ తిరిగి ప్రారంభించాం. ఇలా ఎన్నో కష్టాలు పడి, అరుదైన లొకేషన్స్ లో "ది గోట్ లైఫ్" సినిమా షూటింగ్ కంప్లీట్ చేశాం. పోస్ట్ ప్రొడక్షన్ లోనూ రాజీ లేకుండా వరల్డ్ క్లాస్ క్వాలిటీతో వర్క్ చేశాం. వాస్తవంగా రెండేళ్లలో పూర్తి చేయాల్సిన సినిమా ఇది. కోవిడ్ వల్ల ఆలస్యమైంది.



## సామ్ సైలెంట్‌గా చెక్కేస్తుందా?

సమంత అనారోగ్య సమస్యల కారణంగా ఏడాది పాటు సినిమాలకు, షూటింగ్స్ కు బ్రేక్ తీసుకున్న విషయం తెల్సిందే. గత ఏడాది నుంచి విశ్రాంతి తీసుకుంటూ విదేశాల్లో చక్కర్లు కొడుతున్న సమంత తిరిగి షూటింగ్స్ కు హాజరు అయ్యేందుకు రెడీ అవుతున్నట్లు ఆమె సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. సమంత ఇప్పటికే నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ విడుదలకు సిద్ధం అవుతోంది. ఆ వెబ్ సిరీస్ తర్వాత హిందీలో వరుసగా సమంత సినిమాలు చేసేందుకు గాను రెడీ అవుతుందని వార్తలు వస్తున్నాయి. ముంబై లో సమంత ప్రస్తుతం ఒక మంచి ఇంటిని కొనుగోలు చేయడం లేదా అద్దెకు తీసుకోవడం కోసం సెర్చింగ్ లో ఉందట. ముంబైకి చెందిన ఆమె సన్నిహితులు ఇంటి విషయంలో ఆమెకు సహాయం చేస్తున్నారు. సౌత్ లో ఆమె ఓకే అనాలే కానీ ఒకే సారి నాలుగు అయిదు ఆఫర్లు వస్తాయి. కానీ సామ్ మాత్రం సైలెంట్ గా ముంబై చెక్కేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె సన్నిహితులు మాట్లాడుకునే విషయాలను బట్టి అర్థం అవుతుంది. పర్సనల్ ప్రాబ్లమ్స్ మరియు బాలీవుడ్ లో దక్కిన గుర్తింపు కారణంగా ఇకపై పూర్తిగా హిందీ సినిమా ఇండస్ట్రీలోనే సినిమాలు చేయాలనే నిర్ణయానికి సమంత వచ్చిందనే టాక్ వినిపిస్తుంది.



## 'మనమే' ఫస్ట్ సింగిల్

ప్రామిసింగ్ హీరో శర్వానంద్ 35వ చిత్రం 'మనమే. ట్యాలెంటెడ్ డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత కాగా, కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. ఏడిద రాజా ఈ చిత్రానికి అసోసియేట్ నిర్మాత. మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభించడానికి మేకర్స్ సిద్ధంగా ఉన్నారు. సక్సెస్ ఫుల్ కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ సింగిల్‌కి సంబంధించిన అప్‌డేట్‌తో ముందుకు వచ్చారు. ఇక నా మాటే పాటను మార్చి 28న విడుదల చేయనున్నారు. సాంగ్ పోస్టర్‌లో శర్వానంద్ షేడ్స్‌తో ట్రెండీ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పోస్టర్ లో స్కేటర్ రైడింగ్ చేస్తూ కనిపించారు.

యూనిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా, చైల్డ్ ఆర్టిస్ట్ విక్రమ్ ఆదిత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకి విష్ణు శర్మ, జ్ఞాన శేఖర్ విఎస్ సినిమాటోగ్రఫీని అందించారు. ప్రముఖ టెక్నీషియన్ ప్రవీణ్ పూడి ఎడిటర్, జానీ షేక్ ఆర్ట్ డైరెక్టర్. ఈ చిత్రానికి డైలాగ్స్‌ని అర్జున్ కార్తిక్, రాగూర్, వెంకీ అందిస్తున్నారు.

# బిఆర్ఎస్‌కు మరో షాక్

### ఆ పార్టీతో తెగదెంపులు చేసుకున్న టిబిజికెఎస్

**వరంగల్,మార్చి26(వెలుతురు):** పార్లమెంట్ ఎన్నికల ముందు ముఖ్య నేతలు జంప్ అవడంతో సతమతమవుతున్న బీఆర్ఎస్‌కు ఊహించని మరో బిగ్ షాక్ తగిలింది. సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్.. బీఆర్ఎస్‌కు 'రాం రాం' చెప్పింది. దీంతో సింగరేణిలో కారు పార్టీకి భారీ ఝలక్ తగిలినట్ట య్యింది. గులాబీ పార్టీతో టీబీజీకేఎస్ తెగదెంపులు చేసుకుంది. ఇక స్వతంత్రంగా వ్యవహరించాలని ఆ సంఘం తీర్మానం చేసింది. ఈ మేరకు ఏప్రిల్‌లో కొత్త కమిటీలను టీబీజీకేఎస్ ఏర్పాటు చేయనుంది. దీంతో కార్మిక సంఘం తీసుకున్న ఈ నిర్ణయంతో వరంగల్, పెద్దపల్లి, అదిలాబాద్, ఖమ్మం లోక్ సభ సీట్లలో గులాబీ పార్టీకి కార్మికుల ఓట్లు దూరం కానున్నాయి. కాగా టీబీజీకేఎస్ తీసుకున్న నిర్ణయంతో గులాబీ నేతల్లో టెన్షన్ మొదలైంది.

# పొత్తు ధర్మంతో ముందుకు వెళతాం

### - పురంధేశ్వరి వెల్లడి

**విజయవాడ,మార్చి26(వెలుతురు):** సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం – జనసేన కూటమి నేతలతో కలిసి సమన్వయంతో ముందుకెళ్తామని బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. పొత్తుల్లో భాగంగా తమకొచ్చిన సీట్లల్లో అభ్యర్థులను ఖరారు చేశామని చెప్పారు. పొత్తుల్లో భాగంగా విశాఖ సీటు బీజేపీకి రాలేదన్నారు. ఎంపీ అభ్యర్థుల్లో ఒక్కరిని తప్పించి మిగిలిన వారందరికీ పార్టీలో ఉన్న వారికే ఇచ్చామని తెలిపారు.గెలుపే లక్ష్యంగా పని చేస్తున్న క్రమంలో తిరుపతి జిల్లాలో ఉన్న పరిస్థితుల ప్రకారం నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కార్యకర్తలను కాదని తాము నిర్ణయాలు తీసుకోమని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో




ఉంటారని.. పార్టీ నిర్ణయం తీసుకున్నాక కట్టుబడి ఉంటారని చెప్పారు. పస లేని ఆరోపణలకు సమాధానం ఇవ్వబోనని అన్నారు. ఎన్నికలకు ఏ విధంగా వెళ్లాలనే అంశంపై చర్చించామని తెలిపారు. మిత్రపక్షాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చించామన్నారు. ఎన్డీఏ పార్టీల మధ్య సమన్వయం కోసం కమిటీలు వేసుకుంటామని పురందేశ్వరి తెలిపారు.

### రాజకీయ పార్టీలకు

# ప్రచార అనుమతి తప్పనిసరి

### ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా

**అమరావతి,మార్చి26(వెలుతురు):** ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రచార అనుమతులు పొందడానికి సువిధా పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో కోడ్ అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు,




ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులకు సువిధా పోర్టల్ ద్వారా తీసుకోవాలని సూచించారు. ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, ప్రచార కార్యక్రమాల అనుమతికి కూడా సువిధా పోర్టల్‌ను వినియోగించుకోవాలని కోరారు. 48 గంటలకు ముందుగానే సువిధా యాప్ ద్వారా, నేరుగా అయినా, సంబంధిత రిటర్నింగ్ అధికారికి ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని అన్నారు. ఆన్‌లైన్ నామినేషన్లు, అఫిడవిట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సువిధా పోర్టల్‌ను ఈసీఐ డిజైన్ చేసిందని తెలిపారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలు, ముందస్తు అనుమతులపై సచివాలయంలో నేడు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, బీజేపీ., సీపీఐ(మార్కిస్టు), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీ, టీడీపీ, వైఎస్సార్సీపీ ప్రతినిధులు హాజరైనట్లు ముకేష్ కుమార్ మీనా తెలిపారు.

# జియోతో పోటీకి సిద్ధమవుతున్న అదానీ?

**న్యూఢిల్లీ,మార్చి26(వెలుతురు):**
భారతదేశంలో ముఖేష్ అంబానీ జియో ప్రారంభించిన తర్వాత టెలికాం పరిశ్రమలో కొత్త చరిత్ర సృష్టించారు. అప్పటి నుంచి జియో ఏకపక్ష పాలన సాగిస్తోంది. జియో కనెక్షన్లు దేశంలోని ప్రతి మూలకు, గ్రామాలకు గ్రామాలకు చేరుకున్నాయి. జియోకు పోటీగా ఎవరూ లేరని తెలుస్తోంది. అయితే గౌతమ్ అదానీ కంపెనీ మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఉంది. భారతదేశంలో స్పెక్ట్రమ్ వేలం మే 20 నుండి ప్రారంభమవుతుంది. దీనికి సంబంధించి మార్చి 8న వారికి డీఓటీ నోటీసు కూడా పంపింది. స్పెక్ట్రమ్ వేలంలో పాల్గొనేందుకు అదానీ గ్రూప్ సీఈవో గౌతమ్ అదానీ ఓ సమావేశంలో సూచన చేశారు. ఇందులో మేం పాల్గొంటున్నామని చెప్పారు. అటువంటప్పుడు గౌతమ్ అదానీ 5G ఇంటర్నెట్ సర్వీస్ హక్కులను పొందవచ్చని అంచనా. అదేంటంటే ఫాస్ట్ ఇంటర్నెట్ సర్వీస్‌లో అదానీ గ్రూప్ డైరెక్ట్ ఎంట్రీ ఇచ్చింది. దీనికి సంబంధించి




గౌతమ్ అదానీ ట్విట్టర్‌లో ఓ ఫోటోను కూడా షేర్ చేశారు. టెలికాం రంగంలోకి ప్రవేశించడంపై ఆయన అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కొన్ని నివేదికలు వారు కొత్త కంపెనీతో అడుగుపెట్టవచ్చని చెబుతున్నారు. అయితే దీనిపై అదానీ కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. టెలికాం మార్కెట్‌లోకి గౌతమ్ అదానీ ప్రవేశానికి సంబంధించి పెద్దగా ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే గౌతమ్ అదానీ ఇండస్ట్రీలోకి వస్తే ముఖేష్ అంబానీ, సునీల్ మిట్టల్ లాంటి వ్యాపారవేత్తలతో పోటీ పడతాడా? అలాంటి ప్రశ్న తలెత్తుతుంది. గౌతమ్ అదానీ 5G ఇంటర్నెట్ సర్వీస్ సెక్టార్‌లో భారీ వాటాను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. అత్యధిక బిడ్డర్ కూడా తదుపరి ప్రాసెస్ చేయడం జరుగుతుంది. అయితే ఇది ఖచ్చితంగా అదానీ గ్రూప్‌ని నేరుగా వేగవంతమైన ఇంటర్నెట్ సర్వీస్ ప్రాసెస్‌లోకి ప్రవేశించేలా చేస్తుంది. గౌతమ్ అదానీ ఈ మార్కెట్‌లోకి ప్రవేశించి ఉచిత ఇంటర్నెట్ సేవలను అందించడం ద్వారా కస్టమర్లను ఆకర్షిస్తారని అంచనా. వాస్తవానికి, ప్రస్తుతానికి, ఇవి కేవలం బయట వినిపించే మాటలేనని, మరో రెండు నెలల్లో పూర్తి స్పష్టత వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.





### పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ

# జిల్లా కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో నిర్వహణ

**రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):**
పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీ.ఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏ.పీ.ఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓ.పీ.ఓ)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు మొత్తం 16536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీ.ఓలు 4076 మంది ఉండగా, ఏ.పీ.ఓలు 3968, ఓ.పీ.ఓలు 7952 మంది, మైక్రో అబ్జర్వర్స్ 540 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫామ్-12 ను కూడా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 మరియు 2వ తేదీల్లో పి.ఓ.లకు, ఏ.పి.ఓ.లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలోని ఒక్క రూమ్ లో 50 మంది మాత్రమే ఉండాలని, ప్రొజెక్టర్, ఈవీఎంలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎన్ఐసి అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మ్యానేజ్మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):**
మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా జరిగేందుకు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వస్తుంది అనేది అధికారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేశన్ సెంటర్లో ఓటింగ్ వేసేవిధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.

ఫెసిలిటేశన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజురు చేయడం జరుగుతుందన్నారు. అవగాహన లేకపోవడం చేత పోస్టల్ బ్యాలెట్ లు కొన్ని చెల్లకుండ ఉంటున్నాయని ఈసారి ఒక్క ఓటు కూడా చెల్లని ఓటు పడకుండా పోస్టల్ ‍ ్యాలెట్ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని ఆదేశించారు. ఈ




సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతం పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణరెడ్డి, చేవెళ్ళ ఆర్డీఓ సాయిరాం, తహశీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాజాలో కాల్పుల విరమణకు ఐరాస ఆదేశం

### రంజాన్ వేళ ఐరాస భద్రత మండలి తీర్మానం

**గాజా,మార్చి26(వెలుతురు):**
తొలిసారి గాజాలో కాల్పుల విరమణపై ఐక్యరాజ్యసమితి కీలక తీర్మానం చేసింది. ముస్లింల పవిత్ర పండుగ అయిన రంజాన్ మాసం సందర్భంగా గాజాలో కాల్పులు విరమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానంలో హమాస్ లో బందీలై ఉన్న వారిని తక్షణమే విడుదల చేయాలని పేర్కొంది. ఈ తీర్మానానికి భారీ మెజార్టీ లభించింది. 15 సభ్యదేశాల్లో 14 దేశాలు అనుకూలంగా స్పందించాయి. అయితే గతంలో ఎన్ని తీర్మానాలు ప్రవేశపెట్టినా ఆమోదం కాలేదు. వీటో అధికారంతో ఉన్న వ్యతిరేక సభ్యదేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. తాజాగా యుద్ధం మొదలైన 5నెలల తర్వాత కాల్పుల విరమణకు భద్రతా మండలి తీర్మానం ఆమోదించడం ఇదే తొలిసారి. ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానంపై ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భద్రతా మండలి తీర్మానాన్ని తక్షణమే అమలు చేయాలని, కాల్పుల విరమణ పాటించాలని అన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. '5 నెలలుగా ఎదురుచూస్తున్న ఈ తీర్మానాన్ని భద్రతా మండలి ఆమోదించింది. రంజాన్ పండుగ సందర్భంగా గాజాలో



వెంటనే కాల్పుల విరమణ చేపట్టాలి. అంతేకాకుండా వెంటనే హమాస్ లో ఉన్న బందీలను విడుదల చేయాలి. తీర్మానాన్ని పాటించకపోతే క్షమించడం కుదరదు' అని కార్యదర్శి ఆంటోనియో పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక సూచన చేశారు. గాజాపై కాల్పులు విరమించాలని కోరారు. ఇజ్రాయెల్‌కు అంతర్జాతీయ మద్దతు తగ్గిపోతుందని హెచ్చరించారు. ఈ క్రమంలో సూచనలను తప్పక పాటించాలని కోరారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో చేసిన తీర్మానంతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. భద్రత మండలి తీర్మానాన్ని అమెరికా అడ్డుకోకపోవడంతో పాటు మద్దతు తెలపడంపై నిరాశ వ్యక్తం చేశారు. హమాస్ లో బంధీలైన వారిని విడుదల చేసే నిబంధనలకు అమెరికా అడ్డుకోకుండా సహకరించడంపై ఆయన విముఖత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా తీరుపై జాతీయ భద్రతా విభాగ అధికారి జాన్ కిర్బీ మాట్లాడారు. కాల్పుల విరమణ, బందీల విడుదలే తమ డిమాండ్ అన్నారు. కాగా, వాషింగ్టన్ నుంచి తమ రాయబారులను వెనక్కి తీసుకుంటామన్న ఇజ్రాయెల్ హెచ్చరికలను కూడా అమెరికా పట్టనట్లు ఉండడం గమనార్హం.

# మూడోసారి కూడా ప్రధానిగా మోడీ

### డబ్బులు ఇచ్చిన వారికే పెద్దపల్లి టిక్కెట్

### కాంగ్రెస్ తీరుపై నేతల మండిపాటు

**మందమర్రి,మార్చి26(వెలుతురు):**
కేంద్రంలో మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాధ్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో ఉన్నంత సేపు కేసీఆర్‌ది కుటుంబపాలన అని విమర్శించిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిది కుటుంబ పాలన కాదా అని విమర్శించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ మొండి చేయి చూపిస్తూ డబ్బులు ఇచ్చిన వారికి టికెట్లు ఇస్తుందన్నారు. 60 ఏండ్లలో పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి జరగలేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో ప్రజల సంక్షేమం సాధ్యం కావాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్ట ణంలోని మార్కెట్ సెంటర్‌లో దుకాణ సముదాయాలు తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. దుర్గం అశోక్, డీవీ దీక్షితులు, కుమారస్వామి, మేకల రమేష్, రొడ్డ మోహన్, వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గరాజ్, కొంతం రాజు, తదితరులు పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. లక్షెట్టిపేటలోని బస్టాండ్ నుంచి ఉత్కూరు చౌరస్తా వరకు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి



గోమాస శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. రఘునాథ్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రజల సంక్షే మం సాధ్యం కావాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. హరిగోపాల్, ప్రభాకర్, రమేష్ జైన్, నరేష్‌జైన్ పాల్గొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రభుత్వంతోనే సాధ్యమని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో గూడెంలో మాజీ జడ్పీటీసీ భోజనాయక్, బీఆర్ ఎస్ పార్టీ నాయకులు వల్లంభట్ల శ్రీనివాస్, తిరుపతి, రమేష్, రాజ య్య తదితరులు ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ సమక్ష్యంలో బీజేపీలో చేరారు. గోమాస శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అంతా అవినీతిమయంగా కొనసాగిందన్నారు. పదేళ్ల బీజేపీ పాలన మచ్చ లేకుండా దేశ ప్రజలకు మోదీ మంచి పాలన అందించాడన్నారు. గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గోమాస శ్రీనివాస్ పూజ లు చేశారు. ఎంపీగా గెలిపించాలని సత్యదేవున్ని వేడుకున్నారు. గూడెం లో పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com